PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 246 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- సోమవారం 31 ఆగస్టు 2026

పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


3లో

మిషనరీ చర్చి భూములను పరిరక్షించాలి: సీబీసీ కమిటీ డిమాండ్


3లో

# మూడు దశాబ్దాల నిరీక్షణకు తెర..



## నేడు వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభం



- మార్కాపురంలో కొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోందన్న సీఎం చంద్రబాబు
- 30 ఏళ్ల వెలిగొండ కలను నిజం చేస్తున్నామన్న ముఖ్యమంత్రి
- నల్లమల కొండల గుండా నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలు
- తొలి దశలో లక్షలాది మందికి సాగు, తాగునీటి ప్రయోజనం
- రేపు వెలిగొండ పండుగ వద్ద కలుద్దామంటూ ప్రజలకు పిలుపు

**అమరావతి,ఆగస్టు 30(పిసిడబ్ల్యూ న్యూస్):** మార్కాపురం జిల్లా గడ్డపై సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టబోతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. మూడు జిల్లాల్లోని లక్షలాది మంది ప్రజల భవిష్యత్తుకు తొలి అడుగు పడనుందని, రేపు కొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోందని ఆయన తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. కరవు పీడిత ప్రాంత ప్రజలు మూడు దశాబ్దాలుగా కంటున్న వెలిగొండ కల, **మిగతాది 2లో...**

# ప్రధాని మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పౌర పురస్కారం

- 'ఓలియ్ దరాజలీ దోస్తిలిక్' అవార్డును ప్రదానం చేసిన అధ్యక్షుడు మిర్జియోయెవ్
- 30కి పైగా అంతర్జాతీయ అవార్డులు అందుకున్న భారత నేతగా మోదీ రికార్డు
- తాష్కెంట్‌లో ఇరు దేశాల మధ్య ప్రతినిధుల స్థాయి చర్చలు
- ఉజ్బెకిస్థాన్‌లో ప్రత్యేక యోగా సెషన్‌ను వీక్షించిన ప్రధాని

**న్యూఢిల్లీ,ఆగస్టు 30(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఖాతాలో మరో అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని చేర్చుకున్నారు. మధ్య ఆసియా దేశమైన ఉజ్బెకిస్థాన్ తమ దేశ అత్యున్నత పురస్కారమైన 'ఓలియ్ దరాజలీ దోస్తిలిక్' ఆర్డర్‌తో ఆయన్ను సత్కరించింది. ఆదివారం తాష్కెంట్‌లో జరిగిన కార్యక్రమంలో ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయెవ్ ఈ పురస్కారాన్ని మోదీకి ప్రదానం చేశారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది.

ఈ పురస్కారంతో, ప్రధాని మోదీ ప్రపంచవ్యాప్తంగా అత్యధిక అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్న భారత నేతగా తన రికార్డును మరింత పదిలం చేసుకున్నారు. ఇప్పటివరకు ఆయన **మిగతాది 2లో...**



# దేశవ్యాప్తంగా ముగిసిన నీట్ పీజీ-2026 పరీక్ష..

- జైపూర్‌లో కొందరికి మళ్లీ నిర్వహణ
- మొత్తం 2.65 లక్షల మందికి పైగా హాజరైన అభ్యర్థులు
- జైపూర్‌లో విద్యుత్ అంతరాయం... 2,445 మందికి మళ్లీ పరీక్ష
- సెప్టెంబర్ 5న ప్రభావిత విద్యార్థులకు తిరిగి పరీక్ష నిర్వహణ
- భారీ భద్రత, నిఘా మధ్య పరీక్షలు నిర్వహించిన ఎన్‌బీఈఎంఎస్



**న్యూఢిల్లీ,ఆగస్టు 30(పిసిడబ్ల్యూ న్యూస్):** దేశవ్యాప్తంగా మెడికల్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్-పీజీ 2026 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 2.65 లక్షల మందికి పైగా అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. అయితే, జైపూర్‌లోని ఒక పరీక్షా కేంద్రంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో అక్కడి అభ్యర్థులకు మళ్లీ పరీక్ష **మిగతాది 2లో...**



# మరో జల ప్రళయం..?
## నేపాల్‌లో హై అలర్ట్ జారీ

- నేపాల్‌లోని భోటే కోశి నదికి ఆకస్మిక వరద హెచ్చరిక జారీ
- నదిలో ప్రవాహం పెరిగిన శబ్దాలు రావడంతో అప్రమత్తమైన అధికారులు
- రసువా, నువాకోట్, ధాదింగ్ జిల్లాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచన
- హిమానీనదం విస్ఫోటనం తర్వాత మరో సంక్షోభంతో నేపాల్ ఆందోళన

**అమరావతి,ఆగస్టు 30(పిసిడబ్ల్యూ న్యూస్):** ఇటీవలే హిమానీనదం విస్ఫోటనం కారణంగా తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న నేపాల్‌ను మరో ముప్పు భయపెడుతోంది. భోటే కోశి నదిలో నీటి ప్రవాహం ఆకస్మికంగా పెరగడంతో జాతీయ విపత్తు అవాయ తగ్గింపు, నిర్వహణ అథారిటీ (ఎన్‌డీఆర్ఆర్ఎంఏ) నేడు తీవ్ర వరద హెచ్చరికలు జారీ చేసింది. నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు, స్థానిక అధికారులు అత్యంత **మిగతాది 2లో...**

# 77వసారి ఢిల్లీకి సీఎం రేవంత్

- మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై మంతనాలు


2లో


2లో

# మొక్కలు నాటే లక్ష్యం 91 శాతం పూర్తి

- ఇంటికో పండ్ల మొక్క..ఆరోగ్యానికి బంగారు బాట- వనమహోత్సవ పురోగతి సమీక్షలో మంత్రి సీతక్క




# మాజీ మంత్రి ధర్మాన పై కేసు

- బలవంతంగా గృహ ప్రవేశాలు చేయించారని ఆరోపణ
- ధర్మానతో పాటు మరో ఏడుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు
- గృహనిర్మాణ శాఖ డీఈఈ ఫిర్యాదుతో పోలీసుల చర్యలు
- హుద్‌హుద్ బాధితుల ఇళ్ల పంపిణీలో వివాదం

**అమరావతి,ఆగస్టు 30(పిసిడబ్ల్యూ న్యూస్):** వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుపై శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా గృహ ప్రవేశాలు చేయించారన్న ఆరోపణల నేపథ్యంలో శనివారం **మిగతాది 2లో...**

# హైదరాబాద్‌లో భారీ భూ కుంభకోణం

- రూ.500 కోట్ల భూమిని ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించే కుట్ర
- ఉపసంహరించుకోవాలని
- మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్
- సీఎం ఎ.రేవంత్‌రెడ్డికి లేఖ


2లో

# నేపాల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు


- రంగంలోకి భారత్, చైనా రెస్క్యూ బృందాలు
- 788కి పెరిగిన మృతుల సంఖ్య
- ఇప్పటి వరకు 2502 మంది గల్లంతు


2లో

# ప్రచారం కోసమే జగన్పై నిందలు
## విజయసాయిపై సజ్జల ఫైర్

**అమరావతి,ఆగస్టు 30(పిసిడబ్ల్యూ న్యూస్):** వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి విజయసాయి రెడ్డి విమర్శలపై తీవ్రంగాస్పందించారు. విజయసాయిని జగన్ గతంలోఎంతో అభిమానించారని, ఇప్పుడు సొంత రాజకీయాల కోసం, ప్రచారం కోసం జగన్ ను, వైసీపీనిఆయన విమర్శించడం సరికాదని అన్నారు. విజయసాయి రెడ్డి సొంతంగా రాజకీయాలు చేసుకోవచ్చని, అయితే తమను టార్గెట్ చేస్తే మాత్రం గట్టిగాస్పందిస్తామని సజ్జల హెచ్చరించారు. విజయసాయి

**మిగతాది 2లో...**



# ప్రధాని మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పౌర పురస్కారం

(మొదటి పేజి తరువాయి)

30కి పైగా ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పురస్కారాలు, గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు. గత జులైలోనే ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ఆ దేశ అత్యున్నత పురస్కారం 'బింటాంగ్ ఆదిపుర్న'ను మోదీకి బహూకరించిన విషయం తెలిసిందే.

రెండు రోజుల పర్యటన నిమిత్తం ఉజ్బెకిస్థాన్ వెళ్లిన ప్రధాని మోదీకి తాష్కెంట్‌లో ఘన స్వాగతం లభించింది. అధ్యక్షుడు మిర్జియోయెవ్ స్వయంగా మోదీకి స్వాగతం పలికారు. అనంతరం ఇరు నేతల మధ్య ప్రతినిధుల స్థాయి చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.తన పర్యటనలో భాగంగా, ప్రధాని మోదీ ఓ ప్రత్యేక యోగా సెషన్‌ను వీక్షించారు. ఉజ్బెకిస్థాన్‌కు చెందిన 52 మంది యోగా అభ్యాసకులు ఇందులో పాల్గొన్నారు. వారి ప్రదర్శనను ప్రశంసించిన మోదీ, ఉజ్బెకిస్థాన్‌ను యోగాతో అనుసంధానిస్తున్నందుకు అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. 'ఉజ్బెకిస్థాన్ యోగాను ప్రేమిస్తోంది!' అంటూ ఈ వీడియోను తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఈ ఏడాది జూన్‌లో అహ్మదాబాద్‌లో జరిగిన ప్రపంచ యోగాసన ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న ఆరుగురు క్రీడాకారులు కూడా ఈ ప్రదర్శనలో ఉండటం విశేషం.

# మరో జల ప్రళయం..?

(మొదటి పేజి తరువాయి)

అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించింది.టిబెట్ సరిహద్దు సమీపంలో హిమాలయాల్లో హిమానీనదం కూలిపోవడంతో అనేక గ్రామాలు ధ్వంసమై, భారీ వరదలు సంభవించిన విషయం తెలిసిందే. ఈ పెను విషాదం నుంచి కోలుకోకముందే ఇప్పుడు భోటే కోశి నది నుంచి మరో ప్రమాదం పొంచి ఉంది.

"భోటే కోశి నదిలో వరద ప్రవాహం పెరిగిన శబ్దాలు వినిపించినట్టు రసువా జిల్లా పరిపాలన కార్యాలయానికి సమాచారం అందింది" అని ఎన్‌డీఆర్ఆర్ఎంఏ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ ద్వారా వెల్లడించింది. ఈ సమాచారం మేరకు రసువా, నువాకోట్, ధాదింగ్ జిల్లాల అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. నది చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తదుపరి సమాచారం అందిన వెంటనే మరిన్ని వివరాలు అందిస్తామని తెలిపింది.

కొద్దిసేపటికే ఎన్‌డీఆర్ఆర్ఎంఏ మరో పోస్ట్ చేసింది. భోటే కోశిలో వరద ప్రవాహం మరింత పెరిగినట్లు నివేదికలు అందుతున్నాయని, అందువల్ల సహాయక చర్యల్లో పాల్గొంటున్న సిబ్బంది అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. "రసువాలోని భోటే కోశి నదిలో వరద ప్రవాహం మరింత పెరిగినట్లు తెలుస్తోంది. కాబట్టి రసువా, నువాకోట్, ధాదింగ్, చిత్వాన్ సహా ప్రభావిత ప్రాంతాలలో సహాయ, పునరావాస కార్యక్రమాలలో నిమగ్నమైన సిబ్బంది, నదీ తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి" అని విజ్ఞప్తి చేసింది. ఈ ఆకస్మిక పరిణామంతో నేపాల్ అధికార యంత్రాంగం ఉలిక్కిపడింది. సహాయక బృందాలను అప్రమత్తం చేస్తూ, నష్టం జరగకుండా చర్యలు ముమ్మరం చేసింది.

# మాజీ మంత్రి ధర్మాన పై కేసు

(మొదటి పేజి తరువాయి)

ఆయనతో పాటు మరో ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

గృహనిర్మాణ శాఖ శ్రీకాకుళం డీఈఈ వి.వి. సత్యాజీ అందజేసిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసినట్లు ఎస్పై కరణం సురేశ్ వెల్లడించారు. గతంలో హుద్‌హుద్ తుపాను బాధితులైన మత్స్యకార కుటుంబాల కోసం ప్రభుత్వం గృహాలను నిర్మించింది. పంపిణీ సమయంలో కొంతమంది లబ్ధిదారులు అందుబాటులో లేకపోవడంతో ఆయా ఇళ్లను ఖాళీగా ఉంచారు.

ఈ నేపథ్యంలో తమకు ఆ ఇళ్లను కేటాయించాలని కోరుతూ వైసీపీకి చెందిన కొందరు మత్స్యకారులు గతంలో కలెక్టరుకు విన్నవించుకున్నారు. అయితే, గత మే 14వ తేదీన మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, జడ్పీటీసీ సభ్యురాలు రుప్ప దివ్యతో పాటు మరో ఆరుగురు మత్స్యకారులు నిబంధనలకు విరుద్ధంగా ఆ ఇళ్లలోకి బలవంతంగా ప్రవేశించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

డీఈఈ ఫిర్యాదు మేరకు మొత్తం ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్పై సురేశ్ వివరించారు. ఈ పరిణామం ప్రస్తుతం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది

# ప్రచారం కోసమే జగన్పై నిందలు

(మొదటి పేజి తరువాయి)

ఆరోపణలను ఇకపై పట్టించుకోబోమని,పార్టీ నేతలు కూడా వాటికిప్రాధాన్యం ఇవ్వొద్దనిసూచించారు. జగన్ నాయకత్వాన్ని లక్ష్యంగాచేసుకుని వ్యక్తిత్వ హననం చేస్తున్నారని సజ్జల ఆరోపించారు. పేదల జీవితాల్లో మార్పు తీసుకొచ్చిందిజగనేనని, వైసీపీకి సుదీర్ఘకాలం నాయకత్వంవహించే సత్తా ఆయనకే ఉందన్నారు. పార్టీని వీడినవారి గురించి జగన్ ఎప్పుడూ ప్రతికూలంగామాట్లాడలేదనిచెప్పారు. జగన్ మతమార్పిడులనుప్రోత్సహించారని విజయసాయి చేసిన ఆరోపణలుదారుణమని సజ్జల మండిపడ్డారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే జగన్, వైసీపీపైవిమర్శలు చేస్తున్నారని, విజయసాయి పబ్లిసిటీకోసమే ఈ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

# నేపాల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

**● రంగంలోకి భారత్, చైనా రెస్క్యూ బృందాలు ● 788కి పెరిగిన మృతుల సంఖ్య ● ఇప్పటి వరకు 2502 మంది గల్లంతు**



**ఖాట్మండ్ :ఆగస్టు 30(పిసిడబ్ల్యూ న్యూస్):** నేపాల్‌లో జల ప్రళయం సృష్టించిన ముప్పునకు మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఆకస్మిక వరదలతో మృతుల సంఖ్య 788కు చేరిందని నేపాల్ పోలీసులు తెలిపారు. తాజా గణాంకాల ప్రకారం.. చిత్వాన్ జిల్లాలో అత్యధికంగా 264 మంది మరణించారు. ఆ తర్వాత నవల్పరాసి ఈస్ట్‌బిలో 194, నవల్పరాసి వెస్ట్‌బిలో 120, గూర్ఖాలో 58, నువాకోట్‌బిలో 52, ధాడింగ్‌బిలో 50, తున హున్‌బిలో 37, రుసువాలో 13 మంది ప్రాణాలు కోల్పో యారు. కాగా, నేపాల్ వరదల్లో ఇప్పటి వరకు 2502 మంది గల్లంతు అయ్యారనీ, అందులో నేపాల్ పౌరులు ఉన్నారని ఎన్‌డీఆర్ఆర్ఎంఏ పేర్కొంది. గుర్తు తెలియని మృతదేహాలను గుర్తించే ప్రక్రియ కోసం, వాటిని దేశవ్యాప్తంగా 21 ఆస్పత్రులలో భద్రపరిచినట్టు వివరిం చింది. ప్రస్తుతం 239 మంది క్షతగాత్రులు ఆస్ప త్రులలో చికిత్స పొందుతున్నారని పేర్కొంది. మరోవైపు 20వేల మంది భద్రతా సిబ్బంది భూమార్గం ద్వారా ఇప్పటివరకు మొత్తం 8,730 మందిని సురక్షిత ప్రాం తాలకు చేర్చారు. వైమానిక సిబ్బంది 363 హెలికాప్టర్ ట్రిప్పుల ద్వారా 236 మంది విదేశీయులతో సహా 3,081 మందిని సురక్షితంగా బయటకు తీసుకొ చ్చారు. వరదల్లో చిక్కుకున్న ఒక హైడ్రోపవర్ టన్నెల్ నుంచి 279 మందిని రక్షించారు. మరోవైపు శిథిలాల కింద ఉన్నవారిని రక్షించేందుకు భారత్, చైనా స్పెషల్ రెస్క్యూ బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. కాగా, గుర్తుపట్ట లేనంతగా ఛిద్రమైన మృత దేహాలకు డీఎన్ఏ పరీక్షలు, సామూహిక అంత్య క్రియలతో నేపాల్‌లో హృదయవిదారక పరిస్థితులు నెలకొన్నాయి.

# దేశవ్యాప్తంగా ముగిసిన నీట్ పీజీ-2026 పరీక్ష..

(మొదటి పేజి తరువాయి)

నిర్వహించనున్నట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ పకటించింది.

దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 339 నగరాల్లో ఏర్పాటు చేసిన 1,111 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. మొత్తం 2.73 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 2,65,980 మంది పరీక్షకు హాజరయ్యారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పరీక్షల నిర్వహణ ప్రక్రియ అత్యంత భద్రత నడుమ, సజావుగా సాగిందని ఎన్‌బీఈఎంఎస్ ఒక ప్రకటనలో సంతృప్తి వ్యక్తం చేసింది.పరీక్షల నిర్వహణ దేశవ్యాప్తంగా సజావుగా సాగినప్పటికీ, జైపూర్‌లోని ఒక కేంద్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో అక్కడ పరీక్ష రాస్తున్న 2,445 మంది అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. ఈ ప్రభావిత విద్యార్థుల కోసం సెప్టెంబర్ 5వ తేదీ మధ్యాహ్నం తిరిగి పరీక్ష నిర్వహించనున్నట్లు ఎన్‌బీఈఎంఎస్ స్పష్టం చేసింది. అభ్యర్థులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని, విద్యార్థులందరికీ సమాన అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని బోర్డు తెలిపింది. వారికి పరీక్షా కేంద్రం వివరాలు త్వరలోనే తెలియజేస్తామని హామీ ఇచ్చింది.

పరీక్షల నిర్వహణను పకడ్బందీగా చేపట్టేందుకు ఎన్‌బీఈఎంఎస్ భారీ ఏర్పాట్లు చేసింది. దేశవ్యాప్తంగా 16 ప్రాంతీయ కమాండ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. పరీక్షల తీరును పర్యవేక్షించేందుకు 2,527 మంది ఫ్యాకల్టీ సభ్యులను ఇండిపెండెంట్ అప్రైజర్లుగా నియమించారు. అదనంగా, 700 మందికి పైగా డీన్లు, డైరెక్టర్లు, సీనియర్ ప్రొఫెసర్లతో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను రంగంలోకి దించారు. అన్ని పరీక్షా కేంద్రాలను లైవ్ సీసీటీవీ నిఘాలో ఉంచారు. వీటిని ఢిల్లీ ద్వారకలోని ఎన్‌బీఈఎంఎస్ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ సెంటర్ నుంచి నిరంతరం పర్యవేక్షించారు. ఈ రియల్-టైమ్ నిఘా కోసం ఎన్‌బీఈఎంఎస్, టీసీఎస్‌కు చెందిన 190 మంది సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం పనిచేసింది.

పరీక్షల నిర్వహణ విజయవంతం కావడం వెనుక భాగస్వాములైన వైద్య సంస్థలు, ఫ్యాకల్టీ, భద్రతా ఏజెన్సీలు, టెక్నాలజీ బృందాల సమన్వయం ఉందని ఎన్‌బీఈఎంఎస్ పేర్కొంది. అభ్యర్థులు చూపిన సహనానికి, విశ్వాసానికి ధన్యవాదాలు తెలుపుతూ, పరీక్షల నిర్వహణలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరి కృషిని అభినందించింది.

# మూడు దశాబ్దాల నిరీక్షణకు తెర..

(మొదటి పేజి తరువాయి)

కృష్ణమ్మ జలాలతో కళ్లముందు నిజం కాబోతోందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

పశ్చిమ ప్రకాశం ప్రజల కష్టాలు తీర్చాలన్న సంకల్పంతో 1996లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు మొదటి దశను పూర్తి చేసి, ప్రారంభించే అవకాశం రావడం తనను భావోద్వేగానికి గురిచేస్తోందని, మనసుకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వెలిగొండ కేవలం ఒక ప్రాజెక్టు కాదని, కరవుతో పోరాడిన రైతుకు భరోసా అని, ఫ్లోరైడ్ బాధిత కుటుంబాలకు ఆరోగ్య భద్రత అని, వలస వెళ్లిన యువతకు సొంతగడ్డపై భవిష్యత్తును ఇచ్చే ప్రగతి మార్గమని ఆయన అభివర్ణించారు.ఈ ప్రాజెక్టు మొదటి దశ ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి సురక్షిత తాగునీరు అందుబాటులోకి వస్తుందని చంద్రబాబు వివరించారు. ఈ మహాయజ్ఞం కోసం తమ భూములను, ఇళ్లను, పుట్టి పెరిగిన ఊళ్లను త్యాగం చేసిన 11 గ్రామాల నిర్వాసితులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. నల్లమల కొండలను చీల్చుకుంటూ నల్లమల సాగర్‌లోకి కృష్ణమ్మ జలాలు దూసుకువస్తాయని, ఆ ప్రాంత ప్రజల దశాబ్దాల నీటి కష్టాలను సమూలంగా కడిగేస్తాయని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. రేపటి నుంచి మొదలయ్యే వెలిగొండ జలసిరులు ఆ ప్రాంత అభివృద్ధికి కొత్త రెక్కలు తొడుగుతాయని అన్నారు. ఈ చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని 'వెలిగొండ పండుగ' వద్ద కలుద్దామంటూ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.



## వెలిగొండ ప్రాజెక్టు ట్రయల్ విజయవంతం..

**హెడ్ రెగ్యులేటర్‌కు చేరుకున్న కృష్ణా జలాలు..**

ప్రకాశం జిల్లాతో పాటు పలు జిల్లాల దశాబ్దాల సాగు, తాగునీటి కలను సాకారం చేసే పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ప్రాజెక్టు మొదటి దశకు సంబంధించి అధికారులు ఆదివారం నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతమైంది. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టంతో కరవు సీమలో ఆనందం వెల్లివిరుస్తోంది.

ఆదివారం ఉదయం అధికారులు కొల్లం వాగు వద్ద ప్రాజెక్టు గేట్లను ఎత్తి సొరంగ మార్గంలోకి కృష్ణా జలాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా గేట్ల పనితీరు,



సొరంగంలో నీటి ప్రవాహ వేగాన్ని, నీటి తరలింపు ప్రక్రియను క్షుణ్ణంగా పర్యవేక్షించారు. సొరంగంలో పరుగులు తీసిన కృష్ణా జలాలు గంటవానిపల్లి క్రాస్ హెడ్ రెగ్యులేటర్‌కు చేరుకున్నాయి. ముందుజాగ్రత్త చర్యగా రెగ్యులేటర్ వద్ద సైరన్ మోగించి సమీప ప్రజలను అప్రమత్తం చేశారు. ట్రయల్ రన్ విజయవంతం కావడంతో అధికారులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

శ్రీశైలం జలాశయం ముందు భాగం నుంచి సుమారు 43.5 టీఎంసీల కృష్ణా వరద జలాలను తరలించి, నల్లమల సాగర్‌లో నిల్వ చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. దీని ద్వారా ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరువు పీడిత, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించనున్నారు. ముఖ్యంగా మార్కాపురం వంటి పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజల నీటి కష్టాలకు ఈ ప్రాజెక్టుతో శాశ్వత పరిష్కారం లభించనుంది. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

# హైదరాబాద్‌లో భారీ భూ కుంభకోణం

**హైదరాబాద్,ఆగస్టు 30(పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్‌లోని అజామాబాద్ పారిశ్రామిక వాడలో గల రూ.500 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించే యత్నాన్ని విరమించుకోవాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. తెలంగాణ ఆయిల్‌ఫెడ్ ఆధీనంలో ఉన్న భూమిని సదరు సంస్థకు కాకుండా ఇతరులకు అప్పనంగా ధారాదత్తం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. బహిరంగ మార్కెట్లో వందల కోట్ల విలువ గల భూమిని కాంగ్రెస్ పార్టీకి చెందిన అనుయాయులకు తక్కువ ధరకు అప్పగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను వెనక్కి తీసుకోవాలన్నారు. మూడు దశాబ్దాలుగా ఆయిల్‌ఫెడ్ ఆధీనంలో 3 ఎకరాల 23 గుంటల భూమి ఉందని గుర్తు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన రూ.87 కోట్లు చెల్లించడానికి సొంత ప్రభుత్వ సంస్థ అయిన ఆయిల్‌ఫెడ్ సిద్ధంగా ఉన్నా, వారిని కాదని ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించడం వెనుక దాగిన కుట్రను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిన కాంగ్రెస్ సర్కార్ రియల్ ఎస్టేట్ ఏజెన్సీగా మారిపోయిందని విమర్శించారు. 1987లోనే సుప్రీంకోర్టు ప్రయివేట్ సంస్థకు మొట్టికాయలు వేసి ప్రభుత్వానిదే హక్కు అని తేల్చినా కమీషన్ల కోసం కాంగ్రెస్ నేతలు తీర్పులనే తుంగలో తొక్కారని లేఖలో పేర్కొన్నారు. ఒక్క అజామాబాద్ అనే కాకుండా కోకాపేట, రాయదుర్గం, గచ్చిబౌలిలోనూ కాంగ్రెస్ రియల్ ఎస్టేట్ దందా నడిపిస్తోందని ఆరోపించారు. స్వార్థం కోసం ఇష్టారాజ్యంగా ఆస్తులు అమ్ముకుంటూ పోతే భవిష్యత్‌లో గుడికి, బడికి, చివరికి స్మశానానికి కూడా రాష్ట్రంలో స్థలం మిగలదని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ముఖ్యమంత్రి ఈ అక్రమ కేటాయింపును రద్దు చేసి, ఆ భూమిని ఆయిల్‌ఫెడ్‌కే దక్కేలా ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజల సొత్తును ప్రయివేట్ వ్యక్తులకు దోచిపెడితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

# 77వసారి ఢిల్లీకి సీఎం రేవంత్

**● మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై మంతనాలు**

**హైదరాబాద్,ఆగస్టు 30(పిసిడబ్ల్యూ న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోమారు ఢిల్లీ వెళ్తున్నారు. సెప్టెంబర్ 3వ తేదీన ఆయన ఢిల్లీ పర్యటనకు వెళ్తారని సీఎం కార్యాలయం మీడియాకు లీకులు ఇచ్చింది. సీఎం ఢిల్లీకి వెళ్లడం ఇది 77వ సారి. సీఎం వెంట పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార, మరో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా వెళ్తారని చెప్తున్నారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ క్రమశిక్షణ వంటి అంశాలపై కాంగ్రెస్ అధిష్ఠానంతో వీరు చర్చిస్తారని తెలిసిందిమంత్రివర్గ విస్తరణ మీద చర్చలు జరుగుతాయని సీఎంవో కార్యాలయం లీకులు వదిలింది. దీనిని అధికారిక పర్యటనగా చెప్పుకొనేందుకు రాష్ట్రానికి సంబంధించిన విభజన హామీలు, పెండింగ్‌లో ఉన్న కేంద్ర నిధుల విడుదల అంశాలపై సీఎం పలువురు కేం ద్ర మంత్రులతో భేటీ అయ్యేందుకు సమయం కోరినట్టు చెప్తున్నారు

# మొక్కలు నాటే లక్ష్యం 91 శాతం పూర్తి

**హైదరాబాద్,ఆగస్టు 30(పిసిడబ్ల్యూ న్యూస్):**

రాష్ట్ర వ్యాప్తంగా వనమహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా, పచ్చని రాష్ట్రంతో పాటు ఆరోగ్యకరమైన తెలంగాణ నిర్మాణానికి ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో చేపట్టిన వనమహోత్సవ పురోగతిపై ఆదివారం సమీక్షించారు. కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మితో కలిసి జిల్లాల వారీగా మొక్కలు నాటడం, ఇంటి ఆవరణల్లో మొక్కల పంపిణీ, గుంతల తవ్వకం, మొక్కల మనుగడపై ఈ సమీక్షలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది శాఖ పరిధిలో 6.18 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 5.61 కోట్లకు పైగా మొక్కలు నాటినట్లు అధికారులు మంత్రికి వివరించారు. దీంతో లక్ష్యంలో 91 శాతం మేర మొక్కల నాటడం పూర్తయిందని తెలిపారు. గుంతల తవ్వకంలో కూడా 92 శాతం పురోగతి సాధించినట్లు వెల్లడించారు. జిల్లాల పనితీరును సమీక్షించిన మంత్రి సీతక్క, నిర్దేశించిన లక్ష్యాల సాధనలో అధికారులు చూపుతున్న చొరవపై సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన లక్ష్యాన్ని కూడా వర్షాలు అనుకూలంగా ఉన్న ప్రస్తుత సమయంలో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అయితే మొక్కలు నాటడంతోనే బాధ్యత పూర్తికాదని మంత్రి స్పష్టం చేశారు.నాటిన ప్రతి మొక్క బతికి ఎదగడమే వనమహోత్సవం అసలు విజయమని అన్నారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించడం, సంరక్షణ చర్యలు చేపట్టడం, మనుగడను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. వనమహోత్సవంలో భాగంగా ఇంటి ఆవరణల్లో నాటేందుకు పెద్ద ఎత్తున మొక్కలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా పండ్ల మొక్కలను ప్రతి కుటుంబానికి చేరవేసే కార్యక్రమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ ఏడాది 2.75 కోట్ల పండ్ల మొక్కలను పంపిణి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఇంట్లో పండ్ల మొక్క పెంచడం అంటే కేవలం పచ్చదనం పెంచడం మాత్రమే కాదు.. కుటుంబ ఆరోగ్యానికి పెట్టుబడి పెట్టడం కూడా అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. జామ, ఉసిరి, మామిడి, సీతాఫలం, మునగ వంటి పండ్ల మొక్కలను ఇంటి వద్ద పెంచుకోవడం ద్వారా కుటుంబ సభ్యులకు తాజా, సహజమైన పోషకాహారం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ప్రతి ఇంట్లో పండ్ల మొక్క, ప్రతి గ్రామంలో విస్తారమైన పచ్చదనం ఉండేలా ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.

# మిషనరీ చర్చి భూములను పరిరక్షించాలి: సీబీసీ కమిటీ డిమాండ్

**- భారీ నిరసన ర్యాలీ,అక్రమ నిర్మాణాలపై జిల్లా కలెక్టర్, అధికారులకు విజ్ఞప్తి**

**హనుమకొండ, ఆగస్టు 30(పిసిడబ్ల్యూ న్యూస్):** మిషనరీ చర్చికి చెందిన విలువైన భూములను తక్షణమే పరిరక్షించాలని, ఆ స్థలాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి (CBC) హనుమకొండ కమిటీ బాధ్యులు డిమాండ్ చేశారు.ఈ మేరకు ఆదివారం హనుమకొండలోని చర్చి ప్రాంగణం నుండి అశోక జంక్షన్ వరకు కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మిషనరీ చర్చి భూములను వ్యక్తిగత, ఆర్థిక ప్రయోజనాల కోసం స్వార్థపరులు వినియోగించరాదని నిరసనకారులు పెద్దెత్తున నినాదాలు చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ... ఏపీ హైకోర్టు పరిధిలో (కోర్టు వివాదంలో) ఉన్న మిషనరీ చర్చి భూముల్లో ఎలాంటి







నిర్మాణాలు చేపట్టకూడదని స్పష్టం చేశారు. చర్చి భూములను ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మిస్తున్న మండల శ్రీనివాస్ రెడ్డిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మిషనరీలు, చర్చి సేవా కార్యక్రమాల కోసం కేటాయించిన భూములను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పేర్కొన్నారు. చర్చి ఆస్తులపై ఎలాంటి అక్రమ ఆక్రమణలు, నిర్మాణాలు జరగకుండా జిల్లా యంత్రాంగం, సంబంధిత అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని కోరారు. చర్చి భూముల పరిరక్షణ కోసం అవసరమైతే తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని కమిటీ బాధ్యులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీబీసీ హనుమకొండ కమిటీ ప్రతినిధులు జి.జె. నిరంజన్ బాబు, ప్రెసిడెంట్ టి. క్రీస్టాఫర్ రూబెన్, సెక్రటరీ జి. విజయ్ స్వరూప్, ఉపాధ్యక్షులు విద్యాకర్, టి. మోజెస్ క్రిస్టాఫర్, ట్రెజరర్ బి. విజయ్ కుమార్, జాయింట్ సెక్రటరీలు జె. డానియేలు, జాన్సన్ ప్రసాద్, మత విశ్వాసకులు బోడ డిన్న, డా. పులి అనిల్ కుమార్, పాస్టర్ ఐజాక్ తదితరులు పాల్గొన్నారు.

# యువత రాజకీయాల్లోకి రావాలి.. ప్రజా సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించాలి

**- పదవుల కోసం కాదు.. ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి రావాలి: జింక వేణు**

**మల్లంపల్లి మండల ప్రతినిధి, ఆగస్టు 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రజాసేవలో చురుకైన పాత్ర పోషించాలని జింక వేణు పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే శక్తి యువత చేతుల్లోనే ఉందని, యువతలో ఉన్న శక్తి, ఆలోచనా సామర్థ్యం, నాయకత్వ లక్షణాలను సమాజ అభివృద్ధికి వినియోగించాల్సిన అవసరం ఉందని అన్నారు.ఈ సందర్భంగా జింక వేణు మాట్లాడుతూ.. రాజకీయాలు కేవలం పదవులు, అధికారం, వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా ప్రజలకు సేవ చేసే పవిత్ర వేదికగా ఉండాలని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచే యువత ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

**ప్రజా సమస్యలపై యువత గళమెత్తాలి**

నిరుద్యోగం, విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, మౌలిక వసతులు తదితర సమస్యలపై యువతకు పూర్తి అవగాహన ఉండాలని జింక వేణు అన్నారు. ప్రజల మధ్య నిరంతరం ఉంటూ వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే దిశగా



కృషి చేయాలని పిలుపునిచ్చారు.యువత సోషల్ మీడియా పోస్టులు, రాజకీయ చర్చలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజలతో కలిసి పనిచేయాలని అన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిపై బాధ్యతాయుతంగా పోరాడితే ప్రజలకు న్యాయం చేయడంతో పాటు సమాజంలో సానుకూల మార్పు తీసుకురావచ్చని పేర్కొన్నారు.

**నిజాయితీ, నిబద్ధతతో ముందుకు సాగాలి**

రాజకీయాల్లోకి వచ్చే యువతలో నిజాయితీ, నిబద్ధత, సేవాభావం తప్పనిసరిగా ఉండాలని జింక వేణు సూచించారు. ప్రజల విశ్వాసాన్ని సంపాదించడమే నిజమైన నాయకత్వానికి కొలమానమని అన్నారు. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేసే యువ నాయకత్వం నేటి సమాజానికి ఎంతో అవసరమని తెలిపారు.“పదవి కోసం రాజకీయాల్లోకి రావద్దు.. ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి రావాలి. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి పనిచేసే యువ నాయకత్వం నేటి సమాజానికి అవసరం” అని జింక వేణు అన్నారు.

**ప్రతి గ్రామం నుంచి యువ నాయకత్వం రావాలి**

ప్రతి గ్రామం నుంచి యువత ప్రజాసేవలోకి వచ్చి గ్రామాభివృద్ధికి తమవంతు కృషి చేయాలని ఆయన కోరారు. యువతలో దాగి ఉన్న నాయకత్వ లక్షణాలను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత పెద్దలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీలపై ఉందన్నారు.యువత రాజకీయాల్లోకి రావడం వల్ల కొత్త ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానం, ప్రజా సమస్యలపై కొత్త విధానాలు ముందుకు వస్తాయని తెలిపారు. అవినీతి, నిర్లక్ష్యం, సమస్యలను పట్టించుకోని ధోరణికి వ్యతిరేకంగా యువత ప్రజల పక్షాన నిలబడాలని పిలుపునిచ్చారు.ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి యువత భాగస్వామ్యం అత్యంత కీలకమని, నేటి యువత రేపటి నాయకత్వంగా ఎదిగి సమాజానికి దిశానిర్దేశం చేయాలని జింక వేణు ఆకాంక్షించారు. యువత ముందుకు వస్తేనే రాజకీయాల్లో కొత్త ఆలోచనలు, కొత్త నాయకత్వం, కొత్త మార్పులు సాధ్యమవుతాయని ఆయన తెలిపారు.

# రాజకీయం అయిపోయింది.. ఇక అభివృద్ధే మా లక్ష్యం

**బురదజల్లే రాజకీయాలు మాని అభివృద్ధికి సలహాలు ఇవ్వండి**

**ప్రతిపక్ష కౌన్సిలర్లకు పుర చైర్మన్ ధరవత్ మోహన్ నాయక్ సూచన**

**కల్లూరు, ఆగస్టు 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఎన్నికలు ముగిసి దాదాపు ఐదు నెలలు గడిచిందని, ఇక రాజకీయాలకు స్వస్తి పలికి కల్లూరు మున్సిపాలిటీ అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని కల్లూరు పుర చైర్మన్ ధరవత్ మోహన్ నాయక్ పిలుపునిచ్చారు.కల్లూరు మున్సిపాలిటీలో ప్రతిపక్ష పార్టీలు తమ వార్డుల్లో పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించడం లేదని, అభివృద్ధి పనులు తమకు సమాచారం ఇవ్వకుండా చేపడుతున్నారని పదేపదే ఆరోపించడం పూర్తిగా అసత్యమని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలిచి మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన రోజునే ఎన్నికలు, రాజకీయాలు ముగిశాయని, ఇకపై అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసినట్లు మోహన్ నాయక్ తెలిపారు. ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లు గెలిచిన వార్డుల్లో కూడా ప్రజల ఆమోదంతో వారు ఎన్నికయ్యారని, ఆయా వార్డుల అభివృద్ధిలో వారికి పూర్తి ప్రాధాన్యత ఉంటుందని మొదటి నుంచే చెప్పామని, అదే విధంగా వ్యవహరిస్తున్నామని అన్నారు. ప్రతిపక్ష కౌన్సిలర్లకు



సమాచారం ఇవ్వకుండా, మున్సిపల్ ప్రోటోకాల్‌ను పాటించకుండా ఎక్కడా అభివృద్ధి పనులు చేపట్టలేదని స్పష్టం చేశారు. ప్రజలకు అధిక ప్రయోజనం చేకూరే పనులకే ప్రాధాన్యత ఇస్తున్నామని, సంబంధిత ప్రజాప్రతినిధులకు సమాచారం అందించిన తర్వాతే పనులు చేపడుతున్నామని తెలిపారు. తాను గతంలో బాధ్యతాయుతమైన సర్పంచ్ పదవిలో పనిచేసి ప్రస్తుతం పుర చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నానని, గ్రామీణ, పట్టణ పాలనలోని సమస్యలు, అభివృద్ధి అవసరాలపై పూర్తి అవగాహన ఉందని మోహన్ నాయక్ అన్నారు. పదేపదే రాజకీయాలు చేయడం, ఆరోపణలు చేయడం, బురదజల్లడం మానుకోవాలి అన్నారు. కల్లూరు అభివృద్ధికి సహకరించాలని విమర్శల కంటే మంచి సలహాలు, సూచనలు ఇస్తే వాటిని స్వాగతిస్తాం అని ఆయన పేర్కొన్నారు. నిజంగా కల్లూరు అభివృద్ధిని కోరుకునే వారైతే స్థానిక ఎమ్మెల్యే, కల్లూరు ప్రాంతానికి చెందిన మంత్రి వద్దకు వెళ్లి ప్రజా సమస్యలు, అభివృద్ధి అవసరాలపై వినతిపత్రాలు అందించాలని సూచించారు.మున్సిపల్ ఎన్నికలు జరిగి దాదాపు ఐదు నెలలు గడిచిందని, కల్లూరు మున్సిపాలిటీలో ఇప్పట్లో ఎన్నికలు లేవనే విషయాన్ని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు గుర్తించాలని అన్నారు. ఇకనైనా రాజకీయాలకు స్వస్తి పలికి కల్లూరు సమగ్ర అభివృద్ధికి అందరూ కలిసి సహకరించాలని పుర చైర్మన్ ధరవత్ మోహన్ నాయక్ కోరారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం




**వరంగల్, ఆగస్టు 30(పిసిడబ్ల్యూ న్యూస్):** లయన్స్ క్లబ్ ఆఫ్ హెచ్ఎన్కే న్యూ శాయంపేట ఆధ్వర్యంలో న్యూ శాయంపేటలోని గ్రీన్ ఫీల్డ్ స్కూల్ లో ఆదివారం ఉచిత కంటి పరీక్ష శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 100 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గవర్నర్ లయన్ ఎన్. సుధాకర్ రెడ్డి హాజరై మాట్లాడారు. లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కంటి వైద్య నిపుణులు డా. రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో పరీక్షలు జరిగాయి. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ వి. శ్యామ్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ జె. అశోక్ రెడ్డి, సెక్రటరీ ఎండి. ఉస్మాన్ పాషా, ట్రెజరర్ జూకంటి శ్రీనివాస్ (వాసు), జిల్లా కాంగ్రెస్ పీసీసీ మెంబర్ మామిండ్ల సురేష్ తో పాటు లయన్ సభ్యులు వలి మహమ్మద్, సురేందర్, నాగరాజు, జి. దశరథం, సోమన్న, రజనీకాంత్, కొల్లూరి కృష్ణ, ఇ. ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

# పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

**- బోనాల పండుగకు పోటెత్తిన భక్తులు.. మొక్కులు చెల్లించుకున్న భక్తజనం**






**ఏటూరునాగారం, ఆగస్టు 30(పిసిడబ్ల్యూ న్యూస్):**ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఆకులవారి ఘనపురం పోచమ్మ తల్లి ఆలయంలో బోనాల పండుగ సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సెలవు రోజు కావడంతో ఉదయం నుంచే ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.తెలంగాణ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను పాటిస్తూ అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించి భక్తులు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, బోనాలను అందంగా అలంకరించి పోచమ్మ తల్లికి సమర్పించారు.‘తల్లి.. మా పంటలు బాగా పండాలి.. మా పిల్లలను చల్లగా చూడాలి.. మా కుటుంబాలను, మా ఊరిని సుఖసంతోషాలతో కాపాడాలి’ అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. ముఖ్యంగా రైతులు వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండాలని ప్రత్యేకంగా ప్రార్థించారు.ఆదివారం సెలవు రోజు కావడంతో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు, మహిళలు, చిన్నారులు కుటుంబ సమేతంగా ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పాఠశాలలకు సెలవు కావడంతో పిల్లలు సైతం పెద్ద సంఖ్యలో ఆలయానికి రావడంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. బోనాల పండుగ సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తి వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు ప్రధాన పూజారి బల్ల భద్రయ్య గారు కర్తగా వ్యవహరించారు. ఆయన ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.పోచమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, రైతులకు పాడిపంటలు సమృద్ధిగా పండాలని భక్తులు ఆకాంక్షించారు.

# ఎన్టీఆర్ నగర్‌లో ఎంఆర్‌పీఎస్ యువజన కమిటీ

- మాదిగల హక్కుల సాధనలో యువత ముందుండాలి
- నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం



**ఉప్పల్ ఆగస్టు 30(పిసిడబ్ల్యూ న్యూస్) :**ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్ డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో ఎంఆర్‌పీఎస్ నూతన యువజన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ఇన్‌చార్జి తిప్పారపు లక్ష్మణ్ ఆధ్వర్యంలో, నియోజకవర్గ ఇన్‌చార్జి కోరపాక అంజి మాదిగ నాయకత్వంలో కార్యక్రమం జరిగింది. నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి సన్మానించారు.అధ్యక్షుడిగా గొల్లూరి రవి, ఉపాధ్యక్షుడిగా బొల్లారం మనోజ్, ప్రధాన కార్యదర్శిగా చేవెళ్ల సాయి శశాంక్, సంయుక్త కార్యదర్శిగా బొల్లారం విగ్నేష్, సలహాదారుగా మదాస్ అజయ్ బాధ్యతలు స్వీకరించారు. కార్యవర్గ సభ్యులుగా కర్రె ఉదయ్, మద్దూరి కిరణ్, సన్నీ, సిరియాల కుమార్, శ్యామల సాయి ఎన్నికయ్యారు.మాదిగల హక్కుల సాధనతో పాటు ఎన్టీఆర్ నగర్‌లో దళితుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల రమేష్, గొల్లూరి సోములు, బొల్లారం యాదగిరి, ఏళ్ల సంతోష్ కుమార్, పన్నల మహేందర్, చింత మధు, బోడ శివ తదితరులు పాల్గొన్నారు.

# నలజాల హరీష్ వివాహ వేడుకల్లో మండల నాయకుల సందడి

**- వివాహ వేడుకల్లో బిఆర్ఎస్ నాయకులు**



**కల్లూరు, ఆగస్టు 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామ పంచాయతీకి చెందిన యువ నాయకుడు నలజాల హరీష్ వివాహ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొర్లగూడెం సొసైటీ అధ్యక్షుడు కీసర వెంకటేశ్వరరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కల్లూరు పురపాలక సంఘం 18వ వార్డు కౌన్సిలర్, మండల యూత్ అధ్యక్షులు పెడకంటి రామకృష్ణ, కళ్యాణ్ కిషోర్, సీహెచ్ కిరణ్ కుమార్, మోర్తాల పిచ్చిరెడ్డి, యువజన నాయకులు సాయి, బాలు తదితరులు పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించిన నాయకులు వారికి వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వారి దాంపత్య జీవితం ఆనందమయం, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు.

# ఇటీవల మరణించిన వ్యక్తి కుటుంబానికి శ్రీనగర్ గ్రామస్తుల ఆర్థిక సాయం

**• 20,500 ఆర్థిక సహాయం అందజేత**

**కుటుంబానికి అండగా నిలిచిన గ్రామస్తులు**



**మల్లంపల్లి మండల ప్రతినిధి ఆగస్టు 30: (పిసిడబ్ల్యూ న్యూస్):** ఇటీవల శ్రీనగర్ గ్రామంలో మృతి చెందిన అజ్మీరా రాములు కుటుంబాన్ని గ్రామస్తులు పరామర్శించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. రాములు మృతితో విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చిన గ్రామస్తులు, తమ వంతు సహాయంగా రూ.20,500 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. రాములు మృతి కుటుంబానికి తీరని లోటని, ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఆర్థిక సహాయం ద్వారా కుటుంబానికి కొంతమేర ఉపశమనం కలిగించడంతో పాటు, వారికి మనోధైర్యం కల్పించేందుకు గ్రామస్తులంతా ఐక్యంగా ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. అజ్మీరా రాములు కుటుంబానికి అవసరమైన సమయంలో స్పందించి ఆర్థిక సహాయం అందించిన గ్రామస్తుల సేవాభావాన్ని పలువురు అభినందించారు. కష్టకాలంలో తోటి మనిషికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సహాయానికి తమ వంతు సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ అజ్మీరా రాములు కుటుంబ సభ్యులు, శ్రీనగర్ గ్రామస్తులు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. "ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడం మనందరి సామాజిక బాధ్యత" అని గ్రామస్తులు పేర్కొన్నారు.

# మతతత్వ రాజకీయాలకు ప్రజా ఐక్యతే ప్రత్యామ్నాయం

**అమరవీరుల ఆశయ సాధనకు ఉద్యమాలే మార్గమని రెడ్ స్టార్ జనరల్ బాడీ స్పష్టం**

**ప్రజల మౌలిక సమస్యలపై ఉద్యమాల నిర్మాణానికి ఉమ్మడి వరంగల్ జిల్లా జనరల్ బాడీ పిలుపు**




**హనుమకొండ ప్రతినిధి, ఆగస్టు 30: (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశంలో పెరుగుతున్న సామాజిక, ఆర్థిక అసమానతలు, క్రోనీ క్యాపిటలిజం, మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని సీపీఐ(ఎంఎల్) రెడ్ స్టార్ ఉమ్మడి వరంగల్ జిల్లా జనరల్ బాడీ సమావేశం పిలుపునిచ్చింది. కార్మికరైతుదళితబహుజన ఐక్యతను విస్తరించడమే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ప్రధాన కర్తవ్యమని సమావేశం స్పష్టం చేసింది. ఆదివారం వరంగల్ లో రాష్ట్ర నాయకులు మండల కుమారస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం పార్టీ నిర్మాణం, ప్రజా ఉద్యమాల దిశ, సమకాలీన రాజకీయ పరిణామాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ భాషా మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రను గుర్తుచేస్తూ, నేటి పరిస్థితుల్లో ప్రజల వాస్తవ సమస్యలను కేంద్రంగా చేసుకున్న ఉద్యమాల ద్వారానే ప్రజల విశ్వాసాన్ని పొందగలమన్నారు. ఉపాధి, భూమి, విద్య, వైద్యం, కనీస వేతనాలు, సామాజిక భద్రత వంటి అంశాలపై ఐక్య పోరాటాలు నిర్మించాలని సూచించారు. కులం, మతం పేరుతో సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టే రాజకీయాలను ఎదుర్కొనేందుకు ప్రజాస్వామిక, లౌకిక, ప్రగతిశీల శక్తుల సమన్వయం అవసరమని నాయకులు పేర్కొన్నారు. గ్రామస్థాయి వరకు పార్టీని బలోపేతం చేయడం, ప్రజా సమస్యలపై నిరంతర ఉద్యమాలు చేపట్టడం, రాయచూరులో జరగనున్న 13వ జాతీయ పార్టీ మహాసభలను విజయవంతం చేయడం లక్ష్యంగా కార్యాచరణ రూపొందించారు. ఈ సమావేశంలో గోగర్ల శంకర్, సురుగు ప్రభాకర్, గడ్డం శరత్, ఎం.ఏ. పాషా, రైతు సమితి ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, కార్మికులు, రైతులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# సామాజిక సేవలో కాసుల మల్లికార్జున్‌కు గౌరవ డాక్టరేట్




**హైదరాబాద్, ఆగస్టు 30( పిసిడబ్ల్యూ న్యూస్):** సమాజ హితం కోసం విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త కాసుల మల్లికార్జున్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి అమెరికా (న్యూజెర్సీ)లోని 'యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్‌షిప్ అండ్ ఎక్సలెన్స్' గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. పుదుచ్చేరిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ డైరెక్టర్, తమిళనాడు మాజీ న్యాయమూర్తి డాక్టర్ కె. వెంకటేశన్ మాట్లాడుతూ సమాజం పట్ల నిబద్ధతతో నిస్వార్థ సేవలు అందించే వారికి ఎల్లప్పుడూ సముచిత గుర్తింపు, గౌరవం లభిస్తాయని పేర్కొన్నారు. యూనివర్సిటీ రీజినల్ జాయింట్ డైరెక్టర్ గౌని నర్సింహా గౌడ్ మాట్లాడుతూ సామాజిక సేవ, విద్య, వైద్యం, కళలు, సైన్స్ తదితర రంగాల్లో విశేష కృషి చేస్తున్న వ్యక్తులను గుర్తించి గౌరవ డాక్టరేట్లతో సత్కరించడం జరుగుతోందని తెలిపారు. గౌరవ డాక్టరేట్ పొందిన అనంతరం కాసుల మల్లికార్జున్ ఆదివారం కాచిగూడలో మీడియాతో మాట్లాడారు. తన సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని అందించిన యూనివర్సిటీ ప్రతినిధులకు, రీజినల్ జాయింట్ డైరెక్టర్ గౌని నర్సింహా గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, ప్రోత్సహిస్తున్న కుటుంబ సభ్యులకు, సేవా కార్యక్రమాల్లో నిరంతరం భాగస్వాములవుతున్న తోటి స్వచ్ఛంద కార్యకర్తలకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# అమ్మమ్మ ఇంటికి వచ్చి.. అనంతలోకాలకు ఇద్దరు బాలురు

**- పండుగ పూట విషాదం..**

**మొండి కుంటలో పడి ఇద్దరి మృతి**

**- బహిర్భూమికి వెళ్లిన సమయంలో ప్రమాదం**






**ములుగు జిల్లా, ఆగస్టు 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాఖీ పండుగ సందర్భంగా అమ్మమ్మ ఇంటికి వచ్చిన ఇద్దరు బాలురు ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందిన విషాద ఘటన ములుగు జిల్లాలో చోటుచేసుకుంది. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ములుగు జిల్లా జీవంతరావుపల్లి అమ్లెట్ విలేజ్ పరిధిలోని గణేష్‌లాల్‌పల్లి (మహరాజ్‌పల్లి) గ్రామ సమీపంలోని మొండి కుంటలో పడి మాలోత్ వినయ్ కుమార్ (15), రాజేష్ (12) మృతి చెందారు. మృతులు మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. రాఖీ పండుగను పురస్కరించుకుని ఇద్దరు బాలురు తమ అమ్మమ్మ ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో బహిర్భూమికి వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు మొండి కుంటలో పడిపోయినట్లు సమాచారం. నీటిలో మునిగిపోవడంతో ఇద్దరూ మృతి చెందారు. మృతులు సునీతయాకూబ్ దంపతుల పిల్లలు. పండుగ సందర్భంగా సంతోషంగా అమ్మమ్మ ఇంటికి వచ్చిన తమ పిల్లలు విగతజీవులుగా మారడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు బాలురు మృతి చెందడంతో కమలాపురం గ్రామంతో పాటు ఘటన జరిగిన గణేష్‌లాల్‌పల్లి పరిసరాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# సెప్టెంబర్ 1న ఘనంగా స్వాతంత్ర్య సమరయోధుడు కేసీ గుప్త 107వ జయంతి వేడుకలు

- రాంకోఠి జైన్ భవన్‌లో ఏర్పాట్లు పూర్తి
- ముఖ్య అతిథులుగా అమరవాది లక్ష్మీనారాయణ, డీఐజీ దుద్దేళ్ల శ్రీనివాస్
- జయంతి సందర్భంగా విస్తృతంగా సేవా కార్యక్రమాలు: నిర్వాహకులు



**హైదరాబాద్, ఆగస్టు 30(పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ విమోచన పోరాటంలో కీలకపాత్ర పోషించిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, వాసవీ ఉద్యమ పితామహుడు దివంగత కల్వకుంట్ల చంద్రసేన గుప్త (కే.సి. గుప్త) 107వ జయంతి వేడుకలను సెప్టెంబర్ 1వ తేదీన ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆదివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్యవైశ్య సంఘం ఇసామియా బజార్ అధ్యక్షుడు కల్వకుంట్ల శ్రీనివాస్ గుప్త, ప్రాజెక్టు అడ్వైజర్ కొమిరిశెట్టి అనిల్ కుమార్ వివరాలు వెల్లడించారు. సెప్టెంబర్ 1న నగరంలోని రాంకోఠి పరిధిలో గల శ్రీ జైన్ భవన్‌లో ఈ జయంతి ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నైజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, హైదరాబాద్ సంస్థాన విముక్తి కోసం కేసీ గుప్త చేసిన పోరాటం, త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. వాసవీ క్లబ్స్ వ్యవస్థాపన ద్వారా సమాజ సేవకు నూతన దిశానిర్దేశం చేసిన మహనీయుడని, ఆయన ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ జయంతి వేడుకలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, డీఐజీ దుద్దేళ్ల శ్రీనివాస్ లతో పాటు పలువురు సామాజిక, రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. జయంతిని పురస్కరించుకుని పలు సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు, కుల బాంధవులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# తీగలగుట్టపల్లి రైల్వే గేట్ వద్ద తారు రోడ్డు పనులకు శంకుస్థాపన

**ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మున్సిపల్ సాధారణ నిధులతో రూ.33 లక్షలతో రోడ్డు నిర్మాణం**

**ప్రజా సమస్యల పరిష్కారానికి మేయర్ ప్రత్యేక చొరవ రాకపోకలకు మరింత సౌకర్యం**





**తీగలగుట్టపల్లి ఆగస్టు 30(పిసిడబ్ల్యూ న్యూస్):** తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్ వద్ద సరైన రోడ్డు సౌకర్యం లేక స్థానిక ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. తీగలగుట్టపల్లి రైల్వే గేట్ నుండి ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని, రోడ్డు సౌకర్యం సరిగా లేక ముఖ్యంగా వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యను వెంటనే పరిష్కరించాలనే ఉద్దేశంతో మేయర్ సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధుల కొరత ఉందని ఆర్‌అండ్‌బీ అధికారులు మేయర్‌కు తెలియజేయడంతో, ప్రజలు మరింత కాలం ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ మార్గంలో సమస్యను పరిష్కరించాలని మేయర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా మున్సిపల్ సాధారణ నిధులు (వీ+ఖీ) నుంచి రూ.33 లక్షలు కేటాయించి తారు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా తీగలగుట్టపల్లి రైల్వే గేట్ వద్ద రూ.33 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో నిర్మించనున్న తారు రోడ్డు పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రత్యేక చొరవతో సేతుబంధన్ స్కీం కింద ఆర్‌ఓబీ నిర్మాణానికి దాదాపు రూ.150 కోట్ల నిధులు మంజూరు చేయించారని, ఆ నిధులతో చేపట్టిన ఆర్‌ఓబీ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. కరీంనగర్ నగరానికి కేంద్ర ప్రభుత్వం నుంచి భారీగా నిధులు తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కృషి చేస్తున్నారని మేయర్ పేర్కొన్నారు. నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థను అందించడమే నగర పాలక సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలు ప్రతిరోజూ ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపేందుకు నగర పాలక సంస్థ నిరంతరం కృషి చేస్తోందన్నారు. తీగలగుట్టపల్లి రైల్వే గేట్ వద్ద తారు రోడ్డు నిర్మాణం పూర్తయితే రైల్వే స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులతో పాటు స్థానిక ప్రజలు, ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఇతర వాహనదారులకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని తెలిపారు. రోడ్డు నిర్మాణంతో ఈ ప్రాంతంలో రవాణా సౌకర్యం మెరుగుపడి ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని మేయర్ అన్నారు. నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ఎక్కడా రాజీ పడకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నిర్ణయించిన గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నగర పాలక సంస్థ వద్ద అందుబాటులో ఉన్న నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని మేయర్ తెలిపారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని అన్నారు. తీగలగుట్టపల్లి రైల్వే గేట్ వద్ద రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు ప్రారంభించినందుకు స్థానిక ప్రజలు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కి మేయర్ కొలగాని శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో మేయర్ తీసుకున్న చొరవను స్థానికులు అభినందించారు. డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కార్పొరేటర్లు సాదినేని లావణ్య మునిందర్, భారీ అపర్ణ జితేందర్, మున్సిపల్ అధికారులు, రైల్వే అధికారులు, స్థానిక ప్రజలు, నాయకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తలసేమియా వ్యాధి నిర్మూలన సామాజిక బాధ్యత

## బాధిత చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన వేడుక

### సంకల్ప వార్షికోత్సవంలో సీటీసీ అడిషనల్ డీసీపీ ఈ.విజయ్‌బాబు, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్








**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** చిన్నారుల చిరునవ్వుల వెనుక దాగి ఉన్న బాధను గుర్తించడం.. వారి కళ్లలోని కన్నీటిని తుడిచి ఆశల వెలుగులు నింపడం.. రక్తం కోసం ఎదురుచూసే తలసేమియా చిన్నారులకు జీవితంపై భరోసా కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని, తలసేమియా కేవలం ఒక కుటుంబ సమస్య కాదని, సమాజం మొత్తం స్పందించాల్సిన మానవీయ సమస్య అని సీటీసీ అడిషనల్ డీసీపీ విజయ్ బాబు అన్నారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ 16వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఖమ్మం నగరంలోని కోణార్క్ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. సంస్థ ఫౌండర్ అనిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీటీసీ అడిషనల్ డీసీపీ ఈ. విజయ్‌బాబు మాట్లాడుతూ... తలసేమియా వ్యాధి నిర్మూలనకోసం విస్తృత అవగాహనతో సామాజిక ఉద్యమం అవసరం అన్నారు. ఒక్క రక్తపు చుక్క.. ఓ చిన్నారి జీవితానికి ఆశాకిరణం అన్నారు. తలసేమియా వ్యాధి నిర్మూలనకు సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ ఒక బాధ్యతగా తీసుకొని పనిచేయాలని, బాధిత చిన్నారులకు అండగా నిలిచి వారి జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన వేడుక అని అడిషనల్ డీసీపీ విజయ్ బాబు పేర్కొన్నారు. కేవలం వార్షికోత్సవాలు జరుపుకోవడమే కాకుండా, తలసేమియా బాధితుల సంఖ్యను తగ్గించేందుకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. సంకల్ప సంస్థ గత 16 ఏళ్లుగా అందిస్తున్న సేవలు మార్గదర్శనీయం అని కొనియాడారు. రక్తం కొరతతో ఏ ఒక్క తలసేమియా చిన్నారి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో పోలీస్ శాఖ తరపున ఎల్లప్పుడూ పూర్తి సహకారం అందిస్తున్నామని, భవిష్యత్తులోనూ తమ మద్దతు కొనసాగుతుందని హామీ ఇచ్చారు. రక్తదానం చేయడం వల్ల ఒక ప్రాణాన్ని కాపాడవచ్చునే అవగాహనను ప్రతి ఒక్కరిలోనూ పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. తలసేమియా బాధితులకు మెరుగైన జీవనాన్ని, భరోసాన్ని అందించడమే మనందరి ప్రధాన లక్ష్యం కావాలని ఆకాంక్షించారు.

**పిల్లల ఆరోగ్యంతో పాటు ఉన్నత భవిష్యత్తు ముఖ్యం :** సమాజంలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలను అధిగమిస్తూ పిల్లలు ఉన్నతమైన భవిష్యత్తును సాధించాలని ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి (జీజీహెచ్) డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. సొంత కుటుంబ సభ్యుల సమస్యలనే పట్టించుకోలేని వర్తమాన సమాజంలో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు రవి, అనిత బాధ్యతాయుతంగా 16 ఏండ్లుగా తలసేమియా చిన్నారుల కోసం సేవలు అందించడం గొప్ప విశేషమన్నారు. పిల్లలను సమాజంలో ఇతరులతో సమానంగా చూడాలని, వారి ఆరోగ్యం, భవిష్యత్తు పట్ల సమాజం సానుకూల దృక్పథంతో ముందుకు రావాలన్నారు. పిల్లలతో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా డాక్టర్ కిరణ్ కుమార్ తలసేమియా చిన్నారులతో నేరుగా ముచ్చటించి, వారి భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల తమ లక్ష్యాలను సాధించాలని, పూర్తి ధైర్యవంతులుగా ఎదగాలని సూచించారు. ఏఆర్ ఆర్ఐ కామరాజు మాట్లాడుతూ... తలసేమియా చిన్నారులకు ఎప్పుడు రక్తం అవసరమైనా రక్తదానం చేసేందుకు తాము సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇంతటి గొప్ప సేవా కార్యక్రమాలు నిర్వహించే సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థకు సహకారం అందిండం ద్వారా తాము సేవలో భాగం అవుతున్నామని, ఇది మానసిక సంతృప్తినిస్తుందని అన్నారు. అనంతరం రక్తదాతలను, చిన్నారుల కోసం సంస్థకు సహకారం అందిస్తున్న దాతలను ఘనంగా సత్కరించారు. ఈ వేడుకల్లో చిన్నారులు తమ ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.నారాయణమూర్తి, డాక్టర్ లక్ష్మీదీప, సంస్థ ఉపాధ్యక్షురాలు పి.పావని, ప్రముఖ విద్యావేత్తలు భాగ్య, మమత, సామాజికవేత్త అనురాధ, సంస్థ బాధ్యులు పి.రవిచందర్, పి.ఉదయ్‌భాస్కర్, ఆర్.కస్తూరి, పి.వంశీకిరీటి, సువర్ణకుమారి, ఏఆర్ కానిస్టేబుల్ క్రిష్ణ, ప్రముఖ జర్నలిస్ట్ నెల్లూరి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

---

# విద్యుత్ బకాయిలు సకాలంలో చెల్లించాలి

### బకాయిలు చెల్లించకపోతే విద్యుత్ సరఫరా నిలిపివేత: మల్లంపల్లి ఏఈ వెంకటేష్ హెచ్చరిక



**మల్లంపల్లి మండల ప్రతినిధి ఆగస్టు 30: (పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యుత్ వినియోగదారులు పేరుకుపోయిన బకాయిలను సకాలంలో చెల్లించాలని, లేనిపక్షంలో నిబంధనల ప్రకారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని మల్లంపల్లి విద్యుత్ శాఖ ఏఈ వెంకటేష్ హెచ్చరించారు. డీఈ ఆదేశాల మేరకు ఆదివారం మల్లంపల్లి పరిధిలో దీర్ఘకాలంగా విద్యుత్ బిల్లులు చెల్లించకుండా బకాయిలు పేరుకుపోయిన గృహ, వాణిజ్య విద్యుత్ సర్వీసులపై అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ వెంకటేష్ మాట్లాడుతూ విద్యుత్ బకాయిల వసూళ్లకు సంబంధించి ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. దీర్ఘకాలంగా విద్యుత్ బిల్లులు చెల్లించకుండా బకాయిలు పేరుకుపోయిన సర్వీసులను గుర్తించి, నిబంధనల ప్రకారం విద్యుత్ సరఫరాను నిలిపివేసినట్లు వెల్లడించారు. బకాయిలు చెల్లించకుండా విద్యుత్‌ను వినియోగిస్తున్న గృహ, వాణిజ్య వినియోగదారులపై ఎలాంటి మినహాయింపులు ఉండవని ఆయన స్పష్టం చేశారు. విద్యుత్ బకాయిలను చెల్లించకుండా కొనసాగుతున్న సర్వీసులను గుర్తించి డిస్కనెక్ట్ చేసే చర్యలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఇప్పటికే బకాయిల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేసిన వినియోగదారులు పెండింగ్ బిల్లులను చెల్లించి నిబంధనల ప్రకారం సరఫరా పునరుద్ధరించుకోవాలని సూచించారు. ప్రతి నెలా విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించడం ద్వారా బకాయిలు పేరుకుపోకుండా చూసుకోవాలని ఏఈ కోరారు. విద్యుత్ బిల్లులు చెల్లించకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల ఒకేసారి పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోయి వినియోగదా రులపై ఆర్థిక భారం పడే అవకాశం ఉందన్నారు. విద్యుత్ సంస్థ అందిస్తున్న సేవలను నిరంతరం కొనసా గించేందుకు వినియోగదారుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా వ్యవస్థ సజావుగా కొనసాగడంతో పాటు సంస్థ ఆర్థిక నిర్వహ ణకు కూడా వినియోగదారులు బాధ్యతగా వ్యవహ రించాలని కోరారు. బకాయిలు ఉన్న ప్రతి వినియో గదారు వెంటనే బిల్లులు చెల్లించి విద్యుత్ శాఖకు సహకరించాలని ఏఈ వెంకటేష్ విజ్ఞప్తి చేశారు.

---

# ప్రవక్త చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలి

- ముస్లిం సమాజానికి ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ పిలుపు
- రేకుర్తి ఫాతిమా మస్జిద్‌లో ఆధ్యాత్మిక సదస్సు విజయవంతం



**కరీంనగర్, ఆగస్టు 30(పిసిడబ్ల్యూ న్యూస్):** మహమ్మద్ ప్రవక్త జీవితం యావత్తు మానవజాతికి అనుసరణీయమని, ప్రవక్త సూచించిన బాటలో ప్రతి ఒక్కరు నడవాలని మజ్లిస్ తహాఫుజ్ ఖత్మె నబువ్వత్ రిలీజియస్ ట్రస్ట్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, మదర్సా అరబియా హిఫ్జుల్ ఖురాన్ ప్రిన్సిపాల్ ముఫ్తి ఘియస్ మొహియుద్దీన్, ముస్లిం సమాజానికి పిలుపునిచ్చారు. నగరంలోని 20వ డివిజన్ రేకుర్తి కంటి ఆసుపత్రి వద్ద మస్జిద్ ఫాతిమాలో హాఫీజ్ అహ్మద్ హిఫ్జి ఆధ్వర్యంలో జరిగిన సీరతున్నబి ఆధ్యాత్మిక సదస్సు విజయవంతమైంది. మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా రబివుల్ అవ్వల్ మాసం సందర్భంగా నిర్వహించిన ఆధ్యాత్మిక సదస్సులో ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త కేవలం ముస్లింలకే ప్రవక్త కాదని యావత్తు మానవులందరికీ కోసం పంపబడ్డటువంటి మహోన్నతుడు అన్నారు. వారసత్వంగా మహమ్మద్ ప్రవక్త జీవితాన్ని కుల మతాల కతీతంగా, భవిష్యత్తు తరాలకు చెప్పాల్సిన బాధ్యత ప్రతి ముస్లింపై ఉన్నదని చెప్పారు. నేటి కంప్యూటర్, స్మార్ట్ ఫోన్ యుగంలో యువత, విద్యార్థులు పెడదారిన పట్టకుండా, చెడు వ్యసనాల బారిన పడకుండా మహమ్మద్ ప్రవక్త జీవిత సూత్రాలు చెప్పారని, వాటిని కుల, మతాలకు అతీతంగా తెలియజేయాల్సిన అవసరం ఖచ్చితంగా ఉందన్నారు. ఈ ఆధ్యాత్మిక సదస్సుకు దాదాపు 500 పైచిలుకు ముస్లింలు హాజరై విజయవంతం చేశారు. సదస్సుకు హాజరై విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి హాఫీజ్ అహ్మద్ హిఫ్జి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఖత్మె నబువ్వత్ సేవకులు కలీమ్ షరీఫ్, అబ్దుల్ రాఫె, మహమ్మద్ రఫీ, హాఫిజ్ ఫరీద్ హిఫ్జి, కాలనీ వాసులు అబ్దుల్ షరీఫ్, మౌజన్ సాబ్ తదితరులు పాల్గొన్నారు.

---

# వాసన్ ఐ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన కార్యక్రమం

### - ముఖ్యఅతిథి ఖమ్మం నగర మాజీ మేయర్ పూనుకొల్లు నీరజ







**ఖమ్మం, ప్రతినిధి ఆగస్టు 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** వాసన్ ఐ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఖమ్మం నగర మాజీ మేయర్ పూనుకొల్లు నీరజ పాల్గొని మాట్లాడారు . ప్రజలలో చాలామందికి నేత్రదానంపై అపోహాలు ఉన్నాయని దీనిపై అవగాహన లేదని సోషల్ మీడియాలో మరియు మీడియా ద్వారా ప్రచారింపజేసి అవగాహన తీసుకురావాలని కోరారు . ఒక దాత ఇద్దరుకు దృష్టిని దానం చేయవచ్చు అని అన్నారు . కళ్ళు మన శరీరంలో అత్యంత విలువైన భాగం కాబట్టి వాటిని చాలా జాగ్రత్తగా కాపాడుకోవాలని తదనంతరం నేత్రదానం చేయాలని సూచించారు . ఈ సందర్భంగా వాసన్ ఐ కేర్ హాస్పిటల్ డాక్టర్ కిషన్ , డాక్టర్ శివరాం , డాక్టర్ సృజన్ మాట్లాడుతూ వయస్సు , లింగ భేదం లేకుండా ఎవరైనా నేత్రదానం చేయవచ్చు . కళ్ళద్దాలు ధరించేవారు , మధుమేహం , అధిక రక్తపోటు మొదలైన సమస్యలతో బాధపడేవారు , కంటిశుక్లం శస్త్రచికిత్స చేయించుకున్నవారు కూడా కళ్ళను దానం చేయవచ్చు . ఎయిడ్స్, రేబిస్ , హెపటైటిస్ బి/సి , సెప్సిస్ లేదా కొన్ని రకాల క్యాన్సర్లు ఉన్నవారు నేత్రదానం చేయడానికి అనర్హులు . మరణించిన తర్వాత 4 నుండి 6 గంటల లోపు కళ్ళను సేకరించాల్సి ఉంటుందని కావున వ్యక్తి మరణించిన వెంటనే స్థానిక ఐ బ్యాంకుకు సమాచారం అందించాలని కోరారు . నేత్రదానం ప్రాముఖ్యత చాలామందికి తెలవదని అన్నారు . కళ్ళు తొలగించడం వల్ల ముఖం వికృతంగా మారదు . లక్షలాది మంది భారతీయులు కార్నియల్ అంధత్వంతో బాధపడుతున్నారు . సేకరించిన కళ్ళు ద్వారా అంధత్వం ఉన్నవారికి అమర్చి వారికి చూపు ప్రసాదించవచ్చు అని పేర్కొన్నారు . నేత్రదానం చేద్దాం .. చూపును పంచుదాం ! అని అవగాహన ర్యాలీ ని జడ్పీ సెంటర్ వరకు నిర్వహించారు . ఈ కార్యక్రమంలో మేనేజర్ మానుకొండ వీరభద్రం మరియు వాసవి ఐ కేర్ హాస్పిటల్ ఖమ్మం బృందం పాల్గొన్నారు .

---







# శిశుమందిర్‌లో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

**కరీంనగర్,ఆగస్టు30(పీసీడబ్ల్యూ న్యూస్):** శ్రీ సరస్వతి శిశు మందిర్ హైస్కూల్ (E/M), కరీంనగర్‌లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే మనస్తత్వం, ఆరోగ్యకరమైన పోటీ భావన పెంపొందించాలనే ఉద్దేశంతో పలు క్రీడా పోటీలను నిర్వహించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. పోటీల అనంతరం వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమగ్ర వికాసంలో విద్యతో పాటు క్రీడలు కూడా కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రతి విద్యార్థి క్రీడల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. పాఠశాల కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి మాట్లాడుతూ.. క్రీడలను కేవలం పోటీలుగా కాకుండా ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించే సాధనంగా భావించాలని సూచించారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి ఎలగందుల సత్యనారాయణ, గట్టు శ్రీనివాస్, బొడ్ల శ్రీనివాస్, కోట లక్ష్మారెడ్డి, కొత్తూరి ముకుందం, అప్పిడి వకుళాదేవి, డా. ఎలగందుల శ్రీనివాస్, పులాల శ్యామ్, రాపర్తి శ్రీనివాస్, తాటి రాజేశ్వర్ రావు, మేచినేని దేవేందర్ రావు, ఆచార్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

---

# మత్తు పదార్థాల నిర్మూలనకు యువత నడుం బిగించాలి..

### - గన్నేరువరంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ..




**గన్నేరువరం, ఆగస్టు 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** మత్తు పదార్థాల వినియోగానికి యువత దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల బారిన పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పిలుపునిస్తూ గన్నేరువరం మండలంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల వినియోగం వల్ల యువత జీవితాలు నాశనమవుతున్నాయని, కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంటోందని నాయకులు పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విద్య, ఉద్యోగాలు, క్రీడలు, సామాజిక సేవ వంటి సానుకూల మార్గాల్లో ముందుకు సాగాలని సూచించారు. మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో గన్నేరువరం మండల పెద్దలు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, యస్వాడ గ్రామ సర్పంచ్ కటకం తిరుపతి, ఉప సర్పంచ్ గువ్వల భాగ్యలక్ష్మి నరసయ్య, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు మామిడిపల్లి అంజయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గువ్వల సత్యం, యూత్ కాంగ్రెస్ నాయకుడు మామిడిపల్లి లక్ష్మణ్, రాగుల చంద్రయ్య, పాకాల పరశురాం, కూన కొమురయ్య, మామిడిపల్లి హనుమయ్య తదితరులు పాల్గొన్నారు. మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణానికి యువతతో పాటు తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి కృషి చేయాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు.

# పేద యువకుడి సొంతింటి కలను నెరవేరుస్తున్న సర్పంచ్

**హుజురాబాద్,ఆగస్టు30(పీసీడబ్ల్యూ న్యూస్):** తల్లిదండ్రులను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో ఒంటరిగా జీవిస్తున్న ఓ నిరుపేద యువకుడికి సొంతింటి కలను సాకారం చేసేందుకు గ్రామ సర్పంచ్ మానవతా దృక్పథంతో ముందుకొచ్చారు. ప్రభుత్వం ద్వారా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించడంతో పాటు, ఇంటి నిర్మాణానికి అయ్యే అదనపు ఖర్చును సైతం తన సొంత నిధులతో భరిస్తూ ఉచితంగా ఇల్లు నిర్మించి ఇవ్వాలని నిర్ణయించుకున్నారు.కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం శాలపల్లిఇందిరానగర్ గ్రామంలోని న్యూ ఇందిరానగర్ కాలనీకి చెందిన రౌతు తరుణ్ తల్లిదండ్రులు లేక ఒంటరిగా జీవిస్తున్నాడు. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో సొంతింటి నిర్మాణం అతనికి ఎన్నో ఏళ్లుగా కలగానే మిగిలింది.తరుణ్ పరిస్థితిని గుర్తించిన సర్పంచ్ కోడిగుటి ప్రవీణ్ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించేందుకు చొరవ తీసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఇల్లు మంజూరు కావడంతో ఆగిపోకుండా, నిర్మాణానికి అవసరమైన అదనపు మొత్తాన్ని తానే భరించి ఇంటిని పూర్తి చేసి ఇవ్వాలని నిర్ణయించారు.

**ఘనంగా నిర్మాణ పనులకు శ్రీకారం**

ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో ఆదివారం ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు. సర్పంచ్ కోడిగుటి ప్రవీణ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానికుల సమక్షంలో ఇంటి స్థలంలో ముగ్గు వేసి, కొబ్బరికాయ కొట్టి నిర్మాణ



పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడం తన బాధ్యత అన్నారు. తల్లిదండ్రులు లేని తరుణ్ పరిస్థితిని చూసి అతని సొంతింటి కలను నెరవేర్చాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సహాయానికి తన వంతు సహకారం జోడించి ఇంటి నిర్మాణాన్ని పూర్తిచేసి తరుణ్‌కు అందిస్తానని చెప్పారు.

**సర్పంచ్‌కు తరుణ్ కృతజ్ఞతలు**

తనకు ఇల్లు మంజూరు కావడంతో పాటు సర్పంచ్ సొంత ఖర్చుతో ఇంటిని నిర్మించి ఇస్తుండటంపై తరుణ్ ఆనందం వ్యక్తం చేశాడు. తల్లిదండ్రులు లేకపోవడం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇల్లు నిర్మించుకునే పరిస్థితి తనకు లేదని, ఇలాంటి సమయంలో సర్పంచ్ అండగా నిలవడం మరచిపోలేని సహాయమని తెలిపాడు.తన సొంతింటి కలను నెరవేర్చేందుకు కృషి చేసిన సర్పంచ్ కోడిగుటి



ప్రవీణ్‌తో పాటు ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పాలకవర్గ సభ్యులకు తరుణ్ కృతజ్ఞతలు తెలిపారు.నిరుపేద యువకుడికి ప్రభుత్వ పథకం ద్వారా ఇల్లు మంజూరు చేయించడమే కాకుండా సొంత నిధులతో ఇంటి నిర్మాణం చేపట్టడం పట్ల గ్రామస్థులు సర్పంచ్ ప్రవీణ్‌ను అభినందించారు. ప్రజా ప్రతినిధిగా ప్రజల సమస్యలకు స్పందిస్తూ, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన ప్రజాసేవకు నిదర్శనమని వారు పేర్కొన్నారు.

---

# పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలి

## • రైతులు పొలాల వద్ద అందుబాటులో ఉండాలి:

## డిజిటల్ క్రాప్ సర్వే వాలంటీర్ చంద మహేందర్

**మల్లంపల్లి మండల ప్రతినిధి ఆగస్టు 30 (పిసిడబ్ల్యూ న్యూస్):**

రైతులు సాగు చేసిన పంటల వివరాలను ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆన్‌లైన్ పంట నమోదు కార్యక్రమంలో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని డిజిటల్ క్రాప్ సర్వే వాలంటీర్ చంద మహేందర్ సూచించారు.ప్రభుత్వం నియమించిన పంట నమోదు సిబ్బంది గ్రామాల్లోని రైతుల పొలాలను సందర్శించి రైతు సాగు చేస్తున్న పంట, సర్వే నంబర్, సాగు విస్తీర్ణం తదితర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని తెలిపారు. ఈ డిజిటల్ పంట నమోదు ఆధారంగానే ప్రభుత్వం పంటల ఉత్పత్తుల కొనుగోలు, ఇతర వ్యవసాయ సంబంధిత కార్యక్రమాలను చేపట్టే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.కావున మల్లంపల్లి శివారు ప్రాంతంలోని రైతులందరూ పంట నమోదు సిబ్బంది తమ గ్రామానికి, పొలాలకు వచ్చిన సమయంలో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని కోరారు. తమ పొలంలో సాగు చేసిన పంటకు సంబంధించిన సరైన వివరాలను సిబ్బందికి తెలియజేసి పంట నమోదు పూర్తి చేయించుకోవాలని సూచించారు.పంట నమోదు చేయించుకోవడం వల్ల రైతుల సాగు వివరాలు ప్రభుత్వ రికార్డుల్లో నమోదవుతాయని, భవిష్యత్‌లో ప్రభుత్వ వ్యవసాయ కార్యక్రమాలు, పంటల కొనుగోలు తదితర అంశాల్లో ఈ సమాచారం కీలకంగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పంట వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని చంద మహేందర్ కోరారు.చంద మహేందర్డిజిటల్ క్రాప్ సర్వే వాలంటీర్ మల్లంపల్లి శివారుఫోన్: 99498 81320

# బండి సంజయ్ నివాసంలో 'మన్ కీ బాత్' వీక్షణ.



**కరీంనగర్,ఆగస్టు30(పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'మన్ కీ బాత్' 137వ రేడియో కార్యక్రమాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్‌లోని తన నివాసంలో ఆదివారం వీక్షించారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నివాసంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రధానమంత్రి ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోదీ పలు అంశాలపై చేసిన ప్రసంగాన్ని నాయకులు వీక్షించారు.కార్యక్రమంలో కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం, మాజీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు 'మన్ కీ బాత్' కార్యక్రమం ద్వారా ప్రధాని మోదీ దేశ ప్రజలతో నేరుగా అనుసంధానమవుతూ సామాజిక, జాతీయ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు.

# కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో 'మన్ కీ బాత్' వీక్షించిన బోయినపల్లి ప్రవీణ్ రావు



**కరీంనగర్ టౌన్ ఆగస్టు 30(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రధాని నరేంద్ర మోడీ 'మన్ కీ బాత్' కార్యక్రమం దేశ ప్రజల గుండె చప్పుడుగా మారిందని కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు అన్నారు. ఆదివారం (ఆగస్టు 30, 2026) కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పార్లమెంట్ ప్రధాన కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ప్రధాని ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. అనంతరం ప్రవీణ్ రావు మీడియాతో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రతి నెలా అందించే మన్ కీ బాత్ సందేశం దేశ పౌరులందరిలో కొత్త ఉత్సాహాన్ని, దేశభక్తిని నింపుతోందన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి కార్యకర్త, ప్రతి పౌరుడు ప్రధాని మాటల నుండి ఎంతో స్ఫూర్తిని పొందుతున్నారు. సమాజంలో మార్పు కోసం నిస్వార్థంగా పనిచేసే సామాన్యుల శ్రమను గుర్తించి, వారిని ఈ వేదిక ద్వారా ప్రధాని అభినందిస్తున్న తీరు అద్భుతం.ఈరోజు మోడీ ప్రసంగంలో ప్రస్తావించిన అంశాలను స్ఫూర్తిగా తీసుకుని, మన కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత, స్థానిక ఉత్పత్తుల (వోకల్ ఫర్ లోకల్) ప్రోత్సాహం వంటి సేవా కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లేలా, బీజేపీ కార్యకర్తలందరూ గ్రామ గ్రామాన ప్రజలను భాగస్వామ్యం చేస్తూ దేశ ప్రగతిలో భాగం కావాలి." అన్నారు.

# విజ్ఞప్తులపై ఎమ్మెల్యే సానుకూల స్పందన



**కరీంనగర్ జిల్లా ఆగస్టు 30(పిసి డబ్ల్యూ న్యూస్):** ఎల్ఎండి కాలనీలోని ప్రజాభవన్ లో మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదివారం ప్రజలకు అందుబాటులో ఉన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని మానకొండూర్, శంకరపట్నం, తిమ్మాపూర్ మండలాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై ఎమ్మెల్యే కు వినతిపత్రాలు అందజేశారు. వారి సమస్యలను ఆసాంతం సావధానంగా విని, పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ముఖ్యంగా భూసమస్యలు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు, వైద్య సమస్యలపై విజ్ఞప్తులు ఎక్కువగా వచ్చాయి.పలు సమస్యలపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, సంబంధిత శాఖల అధికారులకు ఫోన్ చేసి సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.



# బెల్లంపల్లి ఎల్ఐసి ఏజెంట్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా సిహెచ్ సాయి కృష్ణ ఘనవిజయం





**బెల్లంపల్లి ప్రతినిధి 30 ఆగస్టు 2026 (పిసీడబ్ల్యు న్యూస్):** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమైక్య 1964 2026-29 ఎన్నికలు నిర్వహించడం జరిగింది. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా సిహెచ్ సాయి కృష్ణ , కార్యదర్శిగా సదాశివ్, కోశాధికారిగా వెంకటేశ్వర్లు ఘనవిజయం సాధించారు. సుమారు 450 పైగా ఎల్ఐసి ఏజెంట్లు ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు.

# వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే సండ్ర సందడి

**- నూతన వధూవరులకు ఆశీర్వచనాలు**



**కల్లూరు, ఆగస్టు 30 (పీసీడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలోని తాళ్లూరు వెంకటాపురం గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ నాయుడు వెంకటకృష్ణ, వెంకట్రావమ్మ దంపతుల కుమార్తె ప్రసన్న వివాహ వేడుకల్లో సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన మాట్లాడుతూ నూతన దాంపత్య జీవితం ఆనందమయం, ఆదర్శవంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఒకరిపై ఒకరు ప్రేమ, నమ్మకం, పరస్పర గౌరవంతో జీవితాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఇరు కుటుంబాలకు మంచి పేరు తీసుకురావడంతో పాటు, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని దీవించారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు కట్టా అజయ్‌కుమార్, పోచవరం గ్రామ సర్పంచ్ కట్టా ధనమ్మ, సొసైటీ అధ్యక్షులు నర్వనేని పెద్ద అంజయ్య, చింతలపూడి బారిస్టరు, సండ్ర అభిమానులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# దుర్గా వాణి మృతికి బీఆర్ఎస్ నేతల ఘన నివాళి

**దుర్గావాణి మరణం పట్ల విషాదం..**

**కుటుంబానికి బీఆర్ఎస్ నేతల ప్రగాఢ సానుభూతి**

**కన్నీటి వీడ్కోలు.. దుర్గా వాణి భౌతిక దేహానికి నివాళులర్పించిన బీఆర్ఎస్ నేతలు**

**విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి**




**కల్లూరు, ఆగస్టు 30 (పిసీడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలోని పుల్లయ్య బంజరు గ్రామానికి చెందిన ప్రముఖ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు పెద్దబోయిన నారాయణరావు సతీమణి పెద్దబోయిన దుర్గా వాణి మృతికి బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు.గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న దుర్గా వాణి హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మరణవార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ జడ్పీటీసీ సభ్యుడు కట్టా అజయ్ కుమార్, కల్లూరు మున్సిపాలిటీ 18వ వార్డు కౌన్సిలర్ పెడకంటి రామకృష్ణ తదితరులు ఆదివారం దుర్గా వాణి భౌతిక దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విషాదంలో ఉన్న పెద్దబోయిన నారాయణరావు కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.దుర్గా వాణి మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులు ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని కోరుతూ తమ ప్రగాఢ సంతాపాన్ని, హృదయపూర్వక సానుభూతిని తెలియజేశారు.అనంతరం బీఆర్ఎస్ నాయకులు దుర్గా వాణి అంత్యక్రియల్లో పాల్గొని ఆమెకు తుదివీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షులు పెద్దబోయన మల్లేశ్వరరావు, జాబిశెట్టి శ్రీనివాసరావు, బోబోలు లక్ష్మణ్ రావు, బుర్రి నరసింహారావు, కళ్యాణ్ కిషోర్, రవి, మోర్తాల పిచ్చిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని దుర్గా వాణి మృతికి నివాళులర్పించారు.

# హిందీ సబ్జెక్ట్ ఫోరం ఆవిర్భావం

**- అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా మక్సూద్ అలీ, గద్దపాటి శ్రీనివాస్**



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం జిల్లా హిందీ సబ్జెక్ట్ ఫోరం ఆవిర్భావ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఖమ్మంలోని రిక్కా బజార్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్న హిందీ అధ్యాపకులు పాల్గొని నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ



ఎన్నికకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సునీత, లాల్ మహమ్మద్ లు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. నూతనంగా ఏర్పడిన జిల్లా హిందీ సబ్జెక్ట్ ఫోరంకు అధ్యక్షుడిగా మహమ్మద్ మక్సూద్ అలీ, ప్రధాన కార్యదర్శిగా గద్దపాటి శ్రీనివాస్ ఎన్నికైనారు. జిల్లా విద్యాశాఖ అనుబంధంగా హిందీ సబ్జెక్టు వికాసానికి నిర్వహించే ప్రతి కార్యక్రమంలో ఈ కమిటీ భాగస్వామిగా ఉంటుంది. అంతేకాకుండా నూతన ప్రశ్నాపత్రాలు తయారు చేయడంలోనూ, నూతన ఉపాధ్యాయులకు శిక్షణ అందించడంలోనూ ఈ కమిటీ సమన్వయకారిగా ఉంటుందని కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ మక్సూద్ అలీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలకు కన్వీనర్లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ధనరాజ్, పెదపాక వెంకటేశ్వర్లు, షాబుద్దీన్, చెరుకుపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఆంధ్రా అల్లుడి పెత్తనం ఏంటి?

**ఎమ్మెల్యే అల్లుడి ఒత్తిడితోనే హిందూ యువకులపై వేధింపులు**
**హనుమకొండ సీఐని వెంటనే సస్పెండ్ చేయాలి..**
**హిందూ పండుగలను అడ్డుకుంటే ఊరుకునేది లేదు**
**హిందూ పండుగలపై ఆంక్షలా..? అర్ధరాత్రి అరెస్టులా..?**
**ఇది ప్రజా పాలనా.. రాక్షస పాలనా..?**
**హిందూ యువకుల అరెస్టులపై రావు పద్మ రెడ్డి ఫైర్**








**హన్మకొండ ఆగస్టు 30 (పీసీడబ్ల్యూ న్యూస్) :** ఎమ్మెల్యే ఆంధ్రా అల్లుడికి వత్తాసు పలుకుతున్న హనుమకొండ సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని రావు పద్మ రెడ్డి డిమాండ్ చేశారు.పండుగల స్వేచ్ఛను హరిస్తే సహించబోమన్నారు. ఒక పక్షానికే కొమ్ముకాస్తున్నారా? పోలీసులపై రావు పద్మ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.రాజకీయాలకు అతీతంగా ప్రతి హిందువు కోసం బిజెపి పోరాడుతుందన్నారు.అసలు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే ఎవరు..? నాయిని రాజేందర్ రెడ్డి నా లేదా తన ఆంధ్రా అల్లుడా అని రావు పద్మ ప్రశ్నించారు.హనుమకొండ సిఐని వెంటనే సస్పెండ్ చేయాలని,అర్ధరాత్రి అరెస్టులు రాక్షస పాలనకు నిదర్శనం అన్నారు.ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ తమ పండుగలను స్వేచ్ఛగా జరుపుకునే రాజ్యాంగ హక్కు ఉందని,అయితే వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో హిందూ పండుగల సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించడంతో పాటు అర్ధరాత్రి వేళ యువకులను అరెస్టు చేయడం దారుణమని బీజేపీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పోటీ చేసిన అభ్యర్థి రావు పద్మ రెడ్డి ఆరోపించారు.కానీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో హిందూ పండుగల సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించడమే కాకుండా,రాత్రికి రాత్రే అర్ధరహితంగా అరెస్టులు చేయడం తీవ్రంగా ఖండించదగిన విషయం“ అని బిజెపి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పోటీ చేసిన అభ్యర్థి రావు పద్మ రెడ్డి మండిపడ్డారు .అర్ధరాత్రి వేళల్లో తండ్రి దొరక్కపోతే కొడుకును, కొడుకు దొరక్కపోతే తండ్రిని అరెస్ట్ చేయడం ఏ రకమైన రాక్షస పాలనో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.నియోజక వర్గానికి అసలు ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారా? అని ప్రశ్నించారు.“ఎమ్మెల్యేను మేము గౌరవిస్తాం... కానీ ఎమ్మెల్యే ఆంధ్రా అల్లుడి పెత్తనం ఏంటి? ఆయన చెప్పారని హనుమకొండ సీఐ ఒక పక్షానికే కొమ్ము కాస్తూ,హిందూ యువకులను వేధిస్తూ నిరంకుశంగా ప్రవర్తించడం సరికాదు. ఎమ్మెల్యే అల్లుడికి వత్తాసు పలుకుతున్న హనుమకొండ సీఐని వెంటనే సస్పెండ్ చేయాలి“ అని ఆగ్రహం వ్యక్తం చేశారు.హిందూ యువకులను అక్రమంగా అరెస్టు చేశారనే విషయం తెలుసుకున్న రావు పద్మ రెడ్డి,బిజెపి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి,మాజీ కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ తో కలిసి హనుమకొండ పోలీస్ స్టేషన్ కు చేరుకొని సీఐ ని ప్రశ్నించి పోలీసుల వైఖరిపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.అక్రమంగా అరెస్టు చేసిన బన్నీ,బంటి,రాహుల్ లను అక్కడికక్కడే విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా రావు పద్మ రెడ్డి మాట్లాడుతూ... బిజెపి,బిఆర్ఎస్, కాంగ్రెస్ అనీ రాజకీయాలకు అతీతంగా ప్రతి హిందువు హక్కుల కోసం,పండుగలను స్వేచ్ఛాయుత వాతావరణంలో జరుపుకోవడం కోసం తాము ఎప్పుడూ ముందుండి పోరాడతామని స్పష్టం చేశారు. ప్రశాంతంగా ఉండే వరంగల్ వాతావరణాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని, ఇలాంటి నిరంకుశ చర్యలు ఆపకపోతే ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

---

# చిన్నవంగరలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు ప్రతిష్టాత్మక కమిటీ ఏర్పాటు

**• అంబేద్కర్ ఆశయాలు కొనసాగాలని గ్రామాభివృద్ధి, సామాజిక ఐక్యత లక్ష్యంగా కమిటీ సభ్యుల ఏకగ్రీవ ఎంపిక**



**పెద్దవంగర ఆగస్టు 30 (పీసీడబ్ల్యూ న్యూస్):** పెద్దవంగర మండలంలోని చిన్నవంగర గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రతిష్టాత్మక కమిటీని గ్రామ యువకులు, సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కమిటీ అధ్యక్షుడిగా జలగం రంజాన్ ఎన్నికయ్యారు. వర్కింగ్ అధ్యక్షుడిగా యాసారపు భాస్కర్, రాంపాక యాకయ్య, వ్యవస్థాపక అధ్యక్షుడిగా యాసారపు వెంకన్న బాధ్యతలు చేపట్టారు.ఉపాధ్యక్షులుగా యాసారపు అనిల్, యాసారపు వీరాస్వామి, రాంపాక శేఖర్, జలగం బిక్షపతి, రమేష్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా యాసారపు ప్రవీణ్ డబ్బ యాసారపు ప్రవీణ్ ఎంపికయ్యారు.సహాయ కార్యదర్శులుగా జలగం సందీప్, యాసారపు యాకన్న బొండం. యాసారపు శ్రీను ఎన్నికయ్యారు. సోషల్ మీడియా కార్యదర్శిగా జలగం ప్రభాకర్, సాంస్కృతిక విభాగం బాధ్యతలను మధు(డీజే)కు అప్పగించారు.గౌరవ అధ్యక్షులుగా యాసారపు యాకన్న, యాసారపు కృష్ణ, జలగం బిక్షపతి, జలగం చిరంజీవి, జలగం భూపాల్ నియమితులయ్యారు. ముఖ్య సలహాదారులుగా జలగం లేనిన్, జలగం యాకయ్య, జలగం సుమన్, జలగం సమ్మయ్య, జలగం ఐలయ్య, జలగం కాంతారావు, రాంపాక నవీన్ ఎంపికయ్యారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు జలగం రంజాన్ మాట్లాడుతూ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలందరి సహకారంతో ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. కొత్త కమిటీ సభ్యులకు గ్రామస్థులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# పదవీ విరమణ చేసిన పంజాల అశోక్‌ను సత్కరించిన ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు...







**హన్మకొండ ఆగస్టు 30 (పీసీడబ్ల్యూ న్యూస్) :**వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘంగా 34 సంవత్సరాలు విధులు నిర్వహించిన పంజాల అశోక్ ను వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఘనంగా సన్మానించారు.మడికొండ శివారులోని ఏ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఉద్యోగ విరమణ అభినందన సన్మానోత్సవ కార్యక్రమానికి విచ్చేసి పంజాల అశోక్ ను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...పదవి విరమణ చేసి మరో జీవితంలో అడుగుపెడుతున్న క్రమంలో కుటుంబ సభ్యులతో సమయాన్ని వెచ్చిస్తూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని,అలాగే ఆరోగ్యకరమైన అలవాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు.ఎన్నో సవాళ్లతో కూడుకుని వున్న పోలీస్ ఉద్యోగం సంపూర్ణంగా పూర్తి చేసి పదవి విరమణ పొందడం గొప్ప విషయం అన్నారు.పంజాల అశోక్ ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు,పోలీస్ అధికారులు,టీఎన్జీవో అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# సేవలతో సంపాదించిన గౌరవం... సంతృప్తితో వీడ్కోలు




**- మూడు దశాబ్దాల ప్రజాసేవకు ఘన సన్మానం...**
**- కారుమంచి శ్రీనివాస్ శేష జీవితం ఆనందమయం కావాలని ఆకాంక్షించిన ఏలూరి శ్రీనివాసరావు**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఉద్యోగం అనేది కేవలం విధి నిర్వహణ మాత్రమే కాదు... ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి పరిష్కరించడంలోనే నిజమైన సేవా పరిమళం ఉంటుందని నిరూపించిన వ్యక్తి కారుమంచి శ్రీనివాస్ అని టీజీఓ రాష్ట్ర అధ్యక్షులు, టీజీఈ జేఏసీ సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. మూడు దశాబ్దాలకు పైగా రెవెన్యూశాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందిన కారుమంచి శ్రీనివాస్ సేవలు సమాజానికి ఎంతో విలువైనవని కొనియాడారు.ఖమ్మం ఐడీఓసీ కార్యాలయ సముదాయంలో ఐడీఓసీ కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన కారుమంచి శ్రీనివాస్‌కు ఆదివారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తంబూరి సునీల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, టీజీఓ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విశిష్ట అతిథిగా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ... సుదీర్ఘ ఉద్యోగ ప్రస్థానంలో కారుమంచి శ్రీనివాస్ పనిచేసిన ప్రతిచోట తనదైన ముద్ర వేసుకున్నారని అన్నారు. రెవెన్యూ శాఖలో వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ మూడు దశాబ్దాల సేవలను పూర్తి చేశారని తెలిపారు. పదవిలో ఉన్నంతకాలం అధికారిగా కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండే సేవకుడిగా వ్యవహరించడం వల్లే ఆయనకు అందరి అభిమానాభిమానాలు లభించాయని పేర్కొన్నారు.ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం, ముజ్జిగూడెం గ్రామానికి చెందిన కారుమంచి శ్రీనివాస్ తహసీల్దార్‌గా పనిచేస్తూ అనేక మంది జిల్లా కలెక్టర్ల ప్రశంసలు అందుకున్నారని గుర్తు చేశారు. ఆయన సౌమ్య స్వభావం, వివాదాలకు దూరంగా ఉండే వ్యక్తిత్వం, సమస్యలను సామరస్యంగా పరిష్కరించే తీరు ప్రత్యేకమైనవని కొనియాడారు. ఈ లక్షణాలను గుర్తించిన ఉన్నతాధికారులు కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా కీలక బాధ్యతలు అప్పగించగా, వాటిని అత్యంత చాకచక్యంగా, సమర్థవంతంగా నిర్వహించారని అన్నారు.ఉద్యోగులు, అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు, సామాన్య ప్రజలు ఎవరైనా తమ సమస్యతో వస్తే ఆప్యాయంగా పలకరించి, సాధ్యమైనంత వరకు పరిష్కార మార్గం చూపే మంచి మనసు శ్రీనివాస్ సొంతమని పలువురు పేర్కొన్నారు. కలెక్టరేట్ పరిపాలనా వ్యవహారాల నిర్వహణలో ఆయన చూపిన నిబద్ధత, సమన్వయం, సహృదయత చిరస్మరణీయమని అన్నారు.పదవీ విరమణ అనేది సేవకు ముగింపు కాదు... కొత్త జీవన ప్రయాణానికి ఆరంభం అని ఏలూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉద్యోగ బాధ్యతల నుంచి విముక్తి పొందిన కారుమంచి శ్రీనివాస్ తన శేష జీవితాన్ని ఆరోగ్యంగా, ఆనందంగా, ప్రశాంతంగా కుటుంబ సభ్యులతో గడపాలని హృదయపూర్వకంగా ఆకాంక్షించారు. ఆయనకున్న అపారమైన అనుభవం, సేవా దృక్పథం భవిష్యత్తులో కూడా సమాజానికి అవసరమైన సందర్భాల్లో మార్గదర్శకంగా నిలవాలని కోరారు.మూడు దశాబ్దాల సుదీర్ఘ ఉద్యోగ ప్రస్థానాన్ని సంతృప్తితో ముగించుకున్న కారుమంచి శ్రీనివాస్‌కు ఈ ఘన సన్మానం కేవలం వీడ్కోలు కార్యక్రమం మాత్రమే కాకుండా, ఆయన నిజాయితీతో కూడిన సేవలకు సమాజం అందించిన గౌరవనీరాజనంగా నిలిచింది. పదవులు శాశ్వతం కాకపోయినా, మంచి మనసుతో చేసిన సేవలు, మనుషుల హృదయాల్లో సంపాదించుకున్న స్థానం మాత్రం శాశ్వతంగా నిలుస్తాయని ఈ సందర్భంగా పలువురు భావోద్వేగంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీజీఓ జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు, కార్యదర్శి మోదుగు వేలాద్రి, ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు దేవరకొండ సైదులు, టీజీఓ ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండపల్లి శేషప్రసాద్, తహసీల్దార్లు సైదులు, కృష్ణప్రసాద్, దొడ్డ పుల్లయ్య, రాంబాబు, ప్రసాద్, జిల్లా ట్రెజరర్ వెంకన్న, తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బిక్కు నాయక్, కార్యదర్శి కాంపాటి రమణ, జీపీఓ రాష్ట్ర సంఘ బాధ్యులు షేక్ నాగుల్‌మీరా, జిల్లా అధ్యక్షులు మన్నె గురుమూర్తి, రిటైర్డ్ రెవెన్యూ సిబ్బంది, రెవెన్యూ సంఘ నాయకులు, ఐడీఓసీ కార్యాలయ సిబ్బంది, గెజిటెడ్ అధికారులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా కారుమంచి శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించి, ఆయన భావి జీవితం సుఖసంతోషాలతో, సంపూర్ణ ఆరోగ్యంతో, కుటుంబ సభ్యుల ప్రేమాభిమానాల మధ్య ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు.

# తలసేమియా చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరం



**హన్మకొండ ఆగస్టు 30 (పీసీడబ్ల్యూ న్యూస్) :** తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించారు.వాసవి భవన్,శాంతి నగర్,రైల్వే గేట్,వరంగల్ లోని ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి సహకారంతో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా వచ్చిన రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షులు శిరుప అనిల్,ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు దుబ్బ శ్రీనివాస్,జిల్లా యువజన సంఘం అధ్యక్షులు యాద రవికుమార్ లు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదాతలకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షులు శిరుప అనిల్ మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ప్రతి 15 రోజులకు ఒకసారి రక్తం ఎక్కించుకోవాలి,లేదంటే వారు చనిపోయే ప్రమాదం ఉంది,ఈ కార్యక్రమంలో రక్తదానం చేసి విజయవంతం చేసిన రక్తదాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ రక్తదాన శిబిరంలో 51 యూనిట్ల రక్తాన్ని సేకరించారు.ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ గార్లపాటి శ్రీనివాసులు,ప్రధాన కార్యదర్శి గార్లపాటి నాగేందర్,కోశాధికారి గందె శ్రీనివాస్,యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్,బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్,వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు),పోలీస్ కానిస్టేబుల్ బొట్టు కమలాకర్,రక్తదాతలు వైనాల రమేష్,వేణు,శంకర్ గోపాల్,రమేష్,విజయ్ కుమార్,వినయ్,సంతోష్,అశోక్,సదాశివుడు, మూర్తి,నాగేశ్వరరావు,విక్రమ్,రంజిత్,రవి,శ్రీనివాస్,సతీష్,అనిల్,సునీల్,సంతోష్,నిఖిల్,శ్రావణ్,రాజేష్ ,గజ్జెల సుమన్,ఉప్పరపల్లి రాజ్ కుమార్,ఊరటి రవికుమార్ అలువాల పృథ్వి,మునిగాల రాంప్రసాద్,ఎస్.కె.ముస్తఫా,రక్తదాతలు పాల్గొనడం జరిగింది.

# ఆయన తినే రైస్ మనం తినలేము.



చిత్ర పరిశ్రమలో బతికినంత కాలం కింగ్ నాగార్జున లాగా బతకాలి అని ఎంతోమంది హీరోలు కోరుకుంటుంటారు. ఆయన రిచ్‌నెస్ పక్కన పెడితే, ఆయన లైఫ్‌స్టైల్, శారీరక నిర్మాణం, ఆహారపు అలవాట్లు, ఆరోగ్యం ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తాయి. నాగార్జునగారి వ్యక్తిగత మేకప్ మ్యాన్ చంద్ర, ఆయన ఆహార, ఆరోగ్య రహస్యాలను, ఫిట్‌నెస్ ప్రయాణాన్ని ఇటీవల ఒక యూట్యూబ్ ఇంటర్వ్యూలో వివరంగా పంచుకున్నారు. నాగార్జున ఆహారం విషయంలో అత్యంత క్రమశిక్షణతో ఉంటారని చంద్ర వెల్లడించారు. ఆయన వారంలో ఐదు రోజులు మామూలు ఆహారాన్నే తీసుకుంటారు, కానీ "మితంగా తీసుకోవాలి" అనే సూత్రాన్ని పాటిస్తారు. ఎక్కువగా తినరు. ఉదయం అల్పాహారంలో ఒక ఇడ్లీ, లేదా ఒక వడ, లేదా ఒక గారె మాత్రమే తీసుకుంటారని తెలిపారు. మళ్ళీ ఆకలి వేసినప్పుడే తింటారని, ఆకలి లేనిదే తినరని స్పష్టం చేశారు. చాలా మంది లాగా ఆకలి ఉన్నా లేకపోయినా దొరికింది తినేయరని చంద్ర వివరించారు. మధ్యాహ్న భోజనంలో నాగార్జునగారికి కొన్ని ప్రత్యేకమైన వంటకాలు తప్పనిసరిగా ఉండాలి. రోజూ బెండకాయ, హాట్ చిప్స్ ఆయన డైట్‌లో ఉంటాయి. అన్నం విషయంలో దంపుడు బియ్యం (పొట్టు తీయనివి) మాత్రమే తింటారు. ఇవి పాత రోజుల్లో తినే పద్ధతికి దగ్గరగా ఉంటాయని చంద్ర పేర్కొన్నారు. అన్నం చాలా మెత్తగా, దాదాపు చివిడిపోయినట్లు ముద్దగా ఉండాలని ఆయన కోరుకుంటారని, అది అందరూ తినలేరని చంద్ర నవ్వారు. దంపుడు బియ్యంతో పాటు రసం, ఒక అరటిపండు కూడా ఆయన ఆహారంలో భాగం. ఇవన్నీ కూడా తక్కువ మోతాదులోనే తీసుకుంటారని వివరించారు. శనివారం రాత్రి నుండి నాగార్జునగారికి ఇష్టమైన ఆహారం పాంప్లెట్ చేప అని చంద్ర వెల్లడించారు. అవుట్‌డోర్ షూటింగ్స్‌కు

# ఇప్పుడు అమ్మ నా పక్కన ఉంటే బాగుండేది.



యంగ్ హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ జంటాగా నటించిన లేటేస్ట్ మూవీ చెన్నై లవ్ స్టోరీ. జూలై 24న థియేటర్లలో విడుదలైన ఈ సినిమాకు పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ క్రమంలోనే ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించిన నేపథ్యంలో శ్రేయాస్ మీడియా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో కథానాయిక శ్రీ గౌరీ ప్రియ మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యారు. ఈ విజయం తనకెంతో ప్రత్యేకమని, కొంత భావోద్వేగంగా ఉన్నానని ఆమె తెలిపారు. తన దివంగత తల్లిని గుర్తుచేసుకుంటూ, తన సక్సెస్ తన తల్లి చూసుంటే ఎంతో సంతోషించేవారని పేర్కొన్నారు. అయితే, తన తల్లి తనను చూస్తోందని, ఆమె ఆశీస్సుల వల్లే ఈ పేరు వచ్చిందని గౌరీ ప్రియ అన్నారు. తల్లిదండ్రుల మద్దతు లేకుండా తాను ఏదీ సాధించలేనని, తన తండ్రికి కూడా కృతజ్ఞతలు తెలిపారు."ఇంతటి మంచి పేరు, సక్సెస్ వస్తున్న ఈ సమయంలో మా అమ్మ నా పక్కన ఉండి ఉంటే ఎంతగానో సంతోషించేది. నన్ను ఇలా చూసి ఉంటే ఎంత బాగుండేదో అని చుట్టుపక్కల అందరూ అంటున్నారు. కానీ నాకు తెలుసు.. నా అమ్మ ఎప్పటికీ పైనుంచి నన్ను చూస్తూ ఆశీర్వదిస్తూనే ఉంటుంది" అంటూ భావోద్వేగానికి గురైంది.ఒక అమ్మాయి ప్రేమిస్తే ఎలా ఉంటుందో, ఆమె ప్రేమ గెలిచినా, విఫలమైనా ఆ కోణం నుండి సినిమాను చూపించాలనే ఆలోచన చేసినందుకు రచయిత సాయి రాజేష్‌కి, అలాగే తనను ఎంపిక చేసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అందమైన కథను అద్భుతంగా డైరెక్ట్ చేసిన రవి నంబూరికి హ్యాట్సాఫ్ చెప్పారు. సహనటుడు కిరణ్ అబ్బవరం గురించి మాట్లాడుతూ, ఒక ప్రేమకథలో రెండు పాత్రల మీద రెండున్నర గంటలు కథను నడిపించడం కష్టమైన విషయమని, కానీ కిరణ్ అద్భుతంగా నటించారని కొనియాడారు. కిరణ్‌లో ఒక మంచి స్నేహితుడిని కనుగొన్నానని, తనను ఎప్పుడూ జాగ్రత్తగా చూసుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. సిరి, పూజ, మహేందర్, నవీన్, త్రిగుణ్ సహా చిత్ర యూనిట్‌లోని ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. చివరగా, ఒక తెలుగు అమ్మాయిగా, తన కెరీర్‌లో ఇంత తొందరగా ఇంత మంచి కథ, పాత్ర లభించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని శ్రీ గౌరీ ప్రియ అన్నారు.

# ఎల్లమ్మలో ఈ యంగ్ హీరోయిన్ ఫిక్స్..?




తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన బలగం సినిమాతో ఒక్కసారిగా ప్రేక్షకుల మనసులు దోచేశాడు కమెడియన్ వేణు. కమెడియన్ గా ప్రస్థానం మొదలు పెట్టి సినిమాలు, టీవీ షోలు చేసి ఆ తర్వాత దర్శకుడిగా మారాడు. కెరీర్ బిగినింగ్ లో చిన్న చిన్న పాత్రల్లో కనిపించిన వేణు, ఆతర్వాత కమెడియన్ గా రాణించాడు. సినిమాలతో పాటు జబర్దస్త్ లాంటి కామెడీ షోలో ఎన్నో స్కిట్స్ చేసి నవ్వులు పూయించాడు. వేణు దర్శకుడిగా మారి చేసిన మొదటి సినిమా బలగం ఎంత పెద్ద విజయం సాదించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ సినిమాకు ఏకంగా నేషనల్ అవార్డు కూడా వచ్చింది. బలగం లాంటి సినిమా చేసిన తర్వాత వేణు గ్యాప్ ఇచ్చి ఇప్పుడు ఎల్లమ్మ సినిమాతో రాబోతున్నాడు. ఈ సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నాడు రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్స్, వీడియో గ్లింప్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. అయితే ఈ సినిమాలో దేవికి జోడీగా నటించే హీరోయిన్ గురించి ఆసక్తికర చర్చ జరుగుతుంది. మొదటి సారి దేవిశ్రీ ప్రసాద్ హీరోగా నటిస్తున్నారు. ఆయన పక్కన ఎవరు సెట్ అవుతారా అన్న క్యూరియాసిటీ అందరిలోనూ మొదలైంది. ఇప్పటికే ఈ సినిమాలో హీరోయిన్ గా సాయి పల్లవి నటిస్తుందని టాక్ వచ్చింది.. ఆ తర్వాత ఆమె కాదు కీర్తిసురేష్ నటిస్తుందని వార్తలు వచ్చాయి. ఆతర్వాత ఆమె కాదు మృణాల్ ఠాకూర్ ని వార్తలు వినిపించాయి. ఇక ఇప్పుడు ఓ యంగ్ హీరోయిన్ పేరు తెరమీదకు వచ్చింది.ఆహీరోయిన్ ఎవరో కాదు అనంతిక. ఈ అమ్మడు మ్యాడ్ సినిమాలో నటించి మెప్పించింది. ఆతర్వాత ఎనిమిది వసంతాలు అనే సినిమాలో నటించింది. ఇక ఇప్పుడు రోమాంచికం అనే సినిమా చేస్తుంది. ఇలా వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఈ చిన్నది. ఇప్పుడు ఎల్లమ్మ సినిమాకు సెలక్ట్ అయ్యిందని టాక్ వినిపిస్తుంది. ఇటీవలే టెస్ట్ కట్ కూడా జరిగిందని. ఆల్మోస్ట్ ఈ అమ్మడు హీరోయిన్ గా ఫిక్స్ అయ్యిందని

# కొత్తింట్లోకి అడుగుపెట్టిన టాలీవుడ్ హీరోయిన్..




టాలీవుడ్ అందాల తార, తన సహజ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న నటి ఈషా రెబ్బా జీవితంలో ఒక మైలురాయిని సాధించారు. టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ తాజాగా నూతన గృహంలోకి అడుగుపెట్టారు. కుటుంబ సభ్యుల సమక్షంలో అత్యంత నిరాడంబరంగా మరియు వేడుకగా ఈ గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. కొత్త ఇంటిలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఈషా రెబ్బా కుటుంబ సభ్యులు సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ శుభకార్యంలో భాగంగా ఇంట్లో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం జరిపించారు. సాంప్రదాయ వస్త్రధారణలో పూజా కార్యక్రమాలలో పాల్గొన్న ఈషా రెబ్బా ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. సొంత ఇల్లు కట్టుకోవడం లేదా కొనుగోలు చేయడం ప్రతి ఒక్కరి జీవితంలో ఒక పెద్ద కల అని, ఆ కల నెరవేరడం చాలా ఆనందంగా ఉందని ఆమె సన్నిహితులతో పంచుకున్నారు.ఈ గృహప్రవేశ వేడుకకు సంబంధించిన అందమైన ఫొటోలను ఈషా రెబ్బా తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఈ ఫొటోలలో కొత్త ఇల్లు చాలా అందంగా, ప్రశాంతమైన వాతావరణంలో కనిపిస్తోంది. ఈ పోస్ట్ చూసిన అభిమానులు, తోటి సినీ ప్రముఖులు మరియు నెటిజన్లు ఈషా రెబ్బాకు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. "కొత్త ఇల్లు చాలా అందంగా, ప్రశాంతమైన వాతావరణంలో కనిపిస్తోంది. ఈ పోస్ట్ చూసిన అభిమానులు, తోటి సినీ ప్రముఖులు మరియు నెటిజన్లు ఈషా రెబ్బాకు సోషల్ మీడియాటిలోకి అడుగుపెట్టిన మీకు అభినందనలు, మీ భవిష్యత్తు మరింత ఉజ్వలంగా సాగాలి" అంటూ కామెంట్లు పెడుతున్నారు.లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఈషా రెబ్బా, ఆ తర్వాత వైవిధ్యమైన చిత్రాలతో మంచి నటిగా పేరు తెచ్చుకున్నారు. కేవలం తెలుగులోనే కాకుండా ఇతర భాషా చిత్రాలలోనూ నటిస్తూ బిజీగా ఉన్న ఈషా, తాజాగా కొత్తింటికి మారడంతో ఆమె అభిమానులు మరింత సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# పెళ్లిపై తన అభిప్రాయాన్ని నిక్కచ్చిగా చెప్పిన నందిని రెడ్డి..



తెలుగు సినీ దర్శకురాలు నందిని రెడ్డి ఓ ఇంటర్వ్యూలో తన సినీ కెరీర్, వ్యక్తిగత జీవితంపై అనేక ఆసక్తికర విషయాలను వెల్లడించారు. తన మొదటి సినిమా అలా మొదలైంది స్క్రిప్ట్ చెప్పే సమయం నుంచి విడుదలకు దాదాపు ఆరేళ్ల సమయం పట్టిందని, ఈ కాలం తన జీవితంలో అత్యంత కష్టమైన దశ అని ఆమె పేర్కొన్నారు. తన స్నేహితులు డాక్టర్లుగా స్థిరపడి, ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న సమయంలో తాను మాత్రం సినిమా కోసం పోరాడాల్సి వచ్చిందని, అప్పుడప్పుడు తాను తప్పు చేశానా అని కూడా అనిపించేదని నందిని రెడ్డి గుర్తుచేసుకున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడినప్పుడు, స్నేహితులు బిల్లులు కట్టేవారని, తాను పాకెట్ మనీ కోసం వరల్డ్ స్పేస్ కంపెనీలో రేడియో జాకీగా పనిచేసినట్లు తెలిపారు. అప్పుడు నెలకు 20,000 రూపాయలు వచ్చేదని, వాటితో తన టూ-వీలర్ పెట్రోల్ ఖర్చులు పోగా, కొంత మిగిలేదని వివరించారు. అలా మొదలైంది సినిమా కోసం మొదట 5 లక్షల రూపాయలు రెమ్యునరేషన్‌గా ఇచ్చారని, తరువాత తమిళ రైట్స్ అమ్ముడయ్యాక 20 లక్షలు అదనంగా లభించాయని ఆమె చెప్పారు. ఈ డబ్బుతో తన తల్లి పదేళ్ల పాత అప్పును తీర్చినట్లు నందిని రెడ్డి తెలిపారు. అప్పట్లో రౌడీ షీటర్లు ఇంటికి వచ్చి బెదిరించేవారని, సినిమా రిలీజ్ అయిన తర్వాత డబ్బు ఇస్తానని నమ్మకంగా చెప్పి వారిని పంపించేసి, సినిమా హిట్ అయ్యాక నిర్మాత దాము గారి నుంచి డబ్బు తీసుకొని అప్పు తీర్చినట్లు వివరించారు.

# ఆ హీరో అంటే పిచ్చి.. అతనితో మూవీ డేట్‌కు వెళ్తా



టాలీవుడ్ లో ప్రస్తుతం మోస్ట్ వాంటెడ్ హీరోయిన్లలో ఒకరిగా దూసుకుపోతోంది పంజాబీ ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి. 'హిట్ 2', 'గుంటూరు కారం', 'లక్కీ భాస్కర్', అనగనగా ఒక రాజు వంటి చిత్రాలతో వరుస విజయాలను అందుకుంటూ ఇండస్ట్రీలో 'లక్కీ ఛామ్'గా మారిపోయింది. కేవలం టాలీవుడ్‌లోనే కాకుండా కోలీవుడ్‌లోనూ విజయ్ దళపతి సరసన నటించి అక్కడి ప్రేక్షకుల మనసులను గెలుచుకుంది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ ఆచి తూచి సినిమాలు చేస్తూ మెప్పిస్తుంది. కాగా గతంలో ఈ ముద్దుగుమ్మ ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఓ ఇంటర్వ్యూలో.. "ఒకవేళ మీరు సినీ పరిశ్రమకు చెందిన ఏ హీరోతోనైనా 'మూవీ డేట్' (సినిమాకు వెళ్లడం) కి వెళ్లాల్సి వస్తే.. ఎవరిని ఎంచుకుంటారు?" అని యాంకర్ అడగ్గా ఆసక్తికర సమాధానం చెప్పింది.ఆ ప్రశ్నకు మీనాక్షి ఏమాత్రం తడుముకోకుండా, ఎంతో ఉత్సాహంగా కోలీవుడ్ స్టార్ హీరో శింబు పేరును చెప్పింది. "నేను మూవీ డేట్‌కు వెళ్లాలనుకుంటే ఖచ్చితంగా శింబు సార్‌తోనే వెళ్తాను" అంటూ చాలా ఎగ్జైటింగ్‌గా సమాధానం ఇచ్చింది. శింబు స్క్రీన్ ప్రెజెన్స్, ఆయన నటన అంటే తనకు చాలా ఇష్టమని ఈ బ్యూటీ పేర్కొంది. శింబుపై మీనాక్షి చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.